# వార్త

ఆదివారం

26 మార్చి, 2023



# తెలుగు 'నాటు'కు ఆస్కార్ హారం



'ఎలిఫెంట్ విస్పరర్స్'కు 'గజ'మాల





# ఎన్టీఆర్ సినిమాకు సన్నాహాలు ప్రారంభం..

కొరటాల దర్శకత్వంలో ఎన్టీఆర్ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా.. అని అభిమానులంతా ఎంతో ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్టీఆర్-కొరటాల కాంబినేషన్‌లో వచ్చిన 'జనతా గ్యారేజ్' భారీ విజయం సాధించింది. దాంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమా గురించి అందరిలో ఆతృత నెలకొంది. ఈ చిత్రం కోసం హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ సెట్స్ వేయించినట్లు సమాచారం. రామ్-లక్ష్మణ్ కంపోజ్ చేసిన ఫైట్స్ చిత్రీకరణతో ఫస్ట్ షెడ్యూల్ మొదలు అవుతుందని సమాచారం. ఎన్టీఆర్‌తో తలపడే విలన్ పాత్రలో సైఫ్ అలీ ఖాన్ నటించనున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఈ సినిమా తొమ్మిది భాషల్లో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

## తెలుగు సినిమాలో మలయాళ నటుడు

వైష్ణవ్‌తేజ్, శ్రీలీల జంటగా నూతన దర్శకుడు ఎన్.శ్రీకాంత్‌రెడ్డి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఎస్.నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారీ సినిమాని. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో వైష్ణవ్‌తేజ్ సరికొత్త మాస్ అవతారంలో కనిపిస్తారు. 'జోసెఫ్', 'నాయట్టు', 'ఇరాట్ట' మొదలైన మలయాళ సినిమాల్లో నటించిన జోజు జార్జ్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. తెలుగులో ఆయనకు ఇదే తొలి చిత్రం.





# పూర్తికానున్న 'సలార్' సినిమా



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడుగా, శృతిహాసన్ హీరోయిన్‌గా సెన్సేషనల్ మాస్ దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'సలార్'. ఇప్పటివరకు ఇండియన్ సినిమా దగ్గర భారీ యాక్షన్ సినిమాగా వచ్చిన 'కెజిఎఫ్ 2'కి మించి ఈ సినిమా ఎన్నో రెట్లు యాక్షన్ ఎలిమెంట్స్‌తో వేరే లెవెల్లో అయితే తెరకెక్కుతోంది.

ఈ భారీ సినిమా షూటింగ్ కొనసాగుతుండగా ఇప్పుడు తాజా అప్డేట్ తెలుస్తోంది. ఎనభై ఐదు శాతం వరకు షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం షూటింగ్ ఇటలీలో చేస్తున్నట్లు సమాచారం.

ఆదివారం వార్త

sunmagvaartha@gmail.com

26 మార్చి, 2023

## మంచి ముత్యాలు

మూర్ఖులు స్వీయానుభవం ద్వారా
మాత్రమే తెలుసుకుంటారు.

- బెంజిమిన్ ఫ్రాంక్లిన్

## విషయ విశేషం

తొలి డిజిటల్ దేశం 'తువాలు'... 4

'సంఘీ'భావం....5

ప్రశ్నాపత్రాల లీకేజీలతో యువతలో నైరాశ్యం

కవర్ స్టోరీ..6

తెలుగు 'నాటు'కు

ఆస్కార్ హారం

మనసుంది చూసారూ మనసు..10

ఈవారం కవిత్వం..12

యాంటిక్స్

అరుదైన శివలింగం......18

కథ.. 20

అంతస్తులు

సాహిత్యం...23

రసగంగాధర తిలకం 'తిలక్'

మహాద్భుతం 'తాజ్‌మహల్' ...25

బతుకు విలువ....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## పర్యావరణ హితం నీలి ఆహారం

సముద్రంలోనూ, నదుల్లోనూ దొరికే రొయ్యలు, చేపలు, పీతలూ.. వంటి వాటిని 'బ్లూ ఫుడ్స్' అని పిలుస్తున్నారు. వీటిల్లో సముద్రంలో, నదుల్లో సహజంగా దొరికేవయితే రెండు వేలకు పైనే ఉంటాయి. ప్రత్యేకంగా పండించే వాటిల్లోనే ఆరు వందల రకాలకు పైగా ఉన్నాయి. రకమేదయినా బ్లూ ఫుడ్స్‌లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. వాటివల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు సైతం తక్కువేనంటున్నారు. ముఖ్యంగా వీటినుంచి విటమిన్ బి12, ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా లభిస్తాయి. అదే భూమ్మీద పెంచే జంతు సంబంధిత ఆహారం వల్ల హృద్రోగాల ప్రమాదం పెరగడంతో పాటు కర్బన వాయువులు ఎక్కువగా విడుదలై కాలుష్యానికీ కారణమవుతున్నాయి. అదే నీలి ఆహారాన్ని పెంచడం వల్ల విడుదలయ్యే కర్బన వాయువులు తక్కువని, మెల్‌బోర్న్ యూనివర్సిటీ నిపుణులు అంటున్నారు. దాంతో పోషకభరితమైన నీలి ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని మెరైన్ ఎకాలజిస్టుల ఉవాచ.

### మందు మాన్పించడానికి ఔషధం

ఆరోగ్యం, ప్రమాదాలు మొదలైన వాటితో పోలిస్తే ప్రపంచ వ్యాప్తంగా మద్యం అలవాటు వల్లనే ఎక్కువ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడుతున్నాయని అధ్యయనాలెన్నో చెబుతున్నాయి. అందుకే ఆ అలవాటును మాన్పించే మందుల కోసం గత కొన్నేళ్లుగా రకరకాల పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. అలా చేస్తున్నప్పుడు సొరియాసిస్ వ్యాధిని తగ్గించడానికి ఇచ్చే మందులు ఆల్కహాల్ అలవాటునీ తగ్గిస్తాయని తెలిసింది. ఆల్కహాల్‌కి బాగా అలవాటు పడినవాళ్ల దాన్ని ఓ పట్టాన మానలేరు సరికదా, దానివల్ల వచ్చే అనర్థాలనూ గుర్తించలేరు. అయితే దీన్ని మానలేకపోవడానికి వాళ్లలో కొన్ని జన్యువులు ఫాస్ఫోడైఎస్టరేజ్-4 అనే ఎంజైమ్‌ను విడుదల చేయడమే కారణమని గుర్తించారు. ఇదే ఇన్‌ఫ్లమేషన్‌కీ కారణమవుతుందట. దాంతో దీన్ని నిరోధించే మందుల గురించి పరిశీలించినప్పుడు సొరియాసిస్‌నీ సొరియాటిక్ ఆర్థ్రయిటిస్‌నీ నివారించే మందులకు ఆ శక్తి ఉన్నట్లు ఒరెగన్ హెల్త్ అండ్ సైన్స్ యూనివర్సిటీ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ మందుల్ని ముందుగా ఎలుకలపైన ప్రయోగించినప్పుడు మెరుగైన ఫలితాలు కనిపించాయట. కనుక వీటిని మనుషుల్లోనూ పరిశీలించి చూడగా ఈ అలవాటు సగానికి సగం తగ్గినట్లు గుర్తించారు. కాబట్టి ఆల్కహాల్ అలవాటును మాన్పించేందుకు ఈ చికిత్స ను త్వరలోనే అందుబాటులోకి తీసుకురావచ్చని భావిస్తున్నారు.





# తొలి డిజిటల్ దేశం 'తువాలు'





పర్యావరణ పరిరక్షణకు కఠిన చర్యలు చేపడతామని ప్రతి సంవత్సరం ప్రపంచ దేశాలు తీర్మానాలు చేస్తున్నాయి. కానీ అవి కేవలం నీటి మీద రాతలుగానే ఉండిపోతున్నాయి. దీంతో కర్బన ఉద్గారాల కారణంగా నీటి మట్టాలు పెరిగిపోతుండటంతో ప్రపంచ వ్యాప్తంగా కొన్ని ద్వీప దేశాల భూభాగాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ద్వీప దేశం కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో తమ దేశాన్ని డిజిటల్ దేశంగా మారుస్తామని ప్రకటించింది. అదే తువాలు ఐలాండ్. తువాలు ఐలాండ్ ఆస్ట్రేలియా, హవాయిల మధ్య ఉంది. ఇది తొమ్మిది దీవుల సమూహం. ఇక్కడ పన్నెండు వేల మంది నివసిస్తున్నారు. ఇప్పటికే తువాలు రాజధాని ప్రాంతం నలభై శాతం సముద్రంలో కలిసిపోయింది. ఇది ఇలాగే కొనసాగితే ఈ దశాబ్దం చివరికి తువాలు పూర్తిగా కనుమరుగైపోవడమే కాకుండా, ప్రపంచంలో గ్లోబల్ వార్మింగ్‌కు బలయ్యే తొలి ద్వీపం ఇదే కానుందని పర్యావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో తువాలు కనుమరుగైనా మెటావర్స్ ద్వారా అక్కడి ప్రకృతి అందాలను, ప్రజల జీవనశైలిని పర్యాటకులు చూడొచ్చు. తువాలును మెటావర్స్ దేశంగా మార్చేందుకు ది మంకీస్, కొల్లైడర్ అనే రెండు సంస్థలు పని చేస్తున్నాయి. ఇందులో తువాలు చరిత్రకు సంబంధించిన డాక్యుమెంట్‌లు, సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన వివరాలు, కుటుంబ ఫొటోలు, సంప్రదాయ పాటలు.. వంటి వాటిని నిక్షిప్తం చేయనున్నారు.



# 'సంఘీ' భావం



## ప్రశ్నాపత్రాల లీకేజీలతో యువతలో నైరాశ్యం

నెలల తరబడి సాధారణ జనజీవనానికి స్వస్తి పలికి పుస్తకాల పైనే ధ్యాస ఉంచి కఠోర శ్రమతో నిరుద్యోగ అభ్యర్థులు పోటీ పరీక్షలకు హాజరౌతారు. సివిల్స్ నుంచి గ్రూప్ 4 వరకు, ఇంజనీర్ల నుంచి లైన్‌మెన్ వరకు ఉద్యోగాలు సాధించడంలో ఏదో ఒక లక్ష్యంతో యువత శ్రమి స్తుంది. అయితే సుమారు దశాబ్ద కాలంగా ప్రభుత్వాలు అనుస రిస్తున్న నిర్లక్ష్య ధోరణి వల్ల యువత మానసిక ఆందోళనకు గురౌతోంది. ఎంసెట్ నుంచి పబ్లిక్ సర్వీసెస్ వరకు ప్రశ్న పత్రాల లీకేజీల వ్యవహారం పోటీ పరీక్షల తీరును హాస్యాస్ప దంగా మార్చి వేసింది. గతంలో మెడికల్ పిజీ ఎంట్రన్స్, ఎంసెట్ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో రాయలసీమకు చెందిన ఒక ముఠా కీలక పాత్ర పోషించేది. ఎంతో శ్రమించి పరీక్ష రాసిన విద్యార్థులకు, నిరుద్యోగులకు ప్రశ్నపత్రం ముందుగానే లీకైందని తెలియడంలో తీవ్రమానసిక వత్తిడికి గురౌతున్నారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం తమ తప్పు ఏమీ లేదన్నట్లు ఆయా పరీక్షలను రద్దు చేసి చేతులు దులుపుకుంటోంది. ప్రశ్న పత్రం రూపకల్పన నుంచి పరీక్షల నిర్వహణ వరకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. చివరకు పరీక్షా కేంద్రాల నుంచి సైతం లీకేజీకి అవకాశం ఉండటంతో ఒక్క నిమిషం నిబంధనను అమలు చేస్తున్నారు. ఈ నిబంధన వల్ల ఎందరో ప్రతిభ గల విద్యార్థు లు పరీక్ష రాయలేకపోతున్నా విస్తృత పరిధి శ్రేయస్సు దృష్ట్యా దీనిని కొనసాగిస్తున్నారు. గతంలో మెడికల్ పిజీ ఎంట్రన్స్ పరీక్షల సమయంలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి నట్లు దర్యాప్తులో తేలింది. బ్లూటూత్, సీక్రెట్, హిడెన్ కెమెరా లను ఉపయోగించి ప్రశ్నపత్రాన్ని, వాటిలో సమాధానాలను కొందరు విద్యార్థులకు పంపించినట్లు తేలింది. దీనితో విద్యార్థులు, అభ్యర్థులు సీక్రెట్ కెమెరాల, బ్లూటూత్‌లు తీసురా కుండా కఠినంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది జరిగిన జెఇఇ మెయిన్స్ పరీక్షలకు హాజరైన విద్యార్థినిల లోదుస్తులను తొల గించాలని కోరడం దేశవ్యాప్తంగా విమర్శలకు గురైంది. క్షేత్ర స్థాయిలో ఇంత కఠినంగా వ్యవహరించే ప్రభుత్వం, అధికారు లు ముందుగా తమ వద్ద ప్రశ్నపత్రాలు గోప్యంగా ఎందుకు ఉంచుకోలేకపోతున్నారన్నది సమాధానం లేని ప్రశ్నగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి. 12 మందిని ఈ కేసులో అరెస్ట్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థ లు ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారని ఆరోపించడమే కాకుండా రాజకీయాలు సైతం ఇందులో కలిపారు. ఎన్ని అరెస్ట్‌లు జరిగినా, ప్రభుత్వం తమ తప్పిదాన్ని ఎదుటివారిపై వేయడానికి ఎన్ని ఎత్తులు వేసినా చివరకు నష్టపోయేది విద్యార్థులే అన్న విషయం గమనించాలి. ప్రస్తుతం తాజాగా తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో ప్రశ్నపత్రాల లీకేజీ రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. ఒక సాధారణ ఉద్యోగి తన పరిధిని దాటి ఈ ప్రశ్న పత్రాలను ముందుగానే బయటకు తీసుకువచ్చి లక్షల రూపాయలకు విక్రయించాడు. ఇందులో ఇప్పటి వరకు 9 మంది పాత్ర ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. దర్యాప్తు, అరెస్ట్‌లు ఒక పార్శ్వం అయితే మరో వైపు అభ్యర్థుల దయనీయ పరిస్థితి. చివరకు గ్రూప్ 1 పరీక్షను కూడా రద్దు చేసారు. గ్రూప్ 1 పరీక్ష షెడ్యూల్ వెలువడక ముందు నుంచే పగలు రాత్రి శ్రమిస్తూ, తల్లిదండ్రుల నుంచి డబ్బు ఖర్చు చేయించి హాస్టళ్లలో నగరాల్లో రోజులు భారంగా గడుపుతూ పరీక్షలకు హాజరైన వారి పరిస్థితి దయనీయంగా మారింది. తాము పడిన శ్రమ అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వృధా అయ్యిందన్న ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. ఒక సాధారణ ఉద్యోగి ప్రశ్నపత్రాలను పెన్‌డ్రైవ్ లో వేసుకుని తీసుకువెళుతుంటే అధికారుల దృష్టికి రాకపోవడం ఆశ్చర్యకరం. సంవత్సరం కష్టపడినా గ్రూప్ 1 పరీక్షల్లో వంద మార్కులు రావడం గగనంగా ఉంటే ఒక్కరోజు కూడా శ్రమించకుండా పరీక్ష రాసిన పబ్లిక్ సర్వీసు కమిషన్ ఉద్యోగికి 103 మార్కులు ఎలా వస్తాయి. ఇప్పుడు ప్రతిఒక్కరిలో ఇదే అనుమానం. 2017లో పబ్లిక్ సర్వీసు కమిషన్‌లో చేరిన సదరు ఉద్యోగి ఏయే పరీక్షల పేపర్లు బయటకు చేరవేశాడన్న అంశం ఇంకా దర్యాప్తులో తేలాల్సి ఉంది. చిన్న స్థాయి ఉద్యోగి ప్రశ్నపత్రాలు దొంగలించి తన కోర్కెలు తీర్చుకోవడానికి, డబ్బు సంపాదించుకుంటూ ఉంటే పబ్లిక్ సర్వీసు కమిషన్ నిఘా వ్యవస్థ ఏం చేస్తోంది. ప్రస్తుతం ప్రశ్నపత్రం విక్రయంలో తేడాలు వచ్చి పోలీసులకు సమాచారం వస్తేనే గాని తెలుసుకోలేని నిద్రావస్థలో పబ్లిక్ సర్వీసు కమిషన్ పనితీరు ఉంది. ప్రశ్న పత్రాల లీకేజీ అన్నది కొత్త విషయ మేమీ కాదు. ఆధునిక సాంకేతిక రాకముందు ముద్రణాలయా ల్లో ప్రశ్నపత్రాలు తయారుచేసినప్పుడే ఇలాంటి ఘటనలు వెలుగు చూశాయి.

ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందింది. సిసీ కెమెరాలు, జిపిఎస్ వ్యవస్థ కీలకంగా మారింది. లక్షలాది మంది నిరుద్యోగులు రాసే పరీక్షా పత్రాలను గోప్యంగా ఉంచాలన్న కనీస బాధ్యత నుంచి అధికారులు, ప్రభుత్వం తప్పించుకుంటున్నాయి. పరీక్షలు రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తే సరిపోదు. అభ్యర్థుల కృషి, కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు వంటి వాటికి ఎవరు సమాధానం ఇస్తారు. భవిష్యత్తులోనైనా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వంపైనా, అధికారులపైనా ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# తెలుగు 'నాటు'కు ఆస్కార్ హారం


కవర్ స్టోరీ
ఎం.వెంకటేశ్వరరావు


బహుశ ఈ పేరు తెలియని ఫిల్మీ లవర్ కానీ, ఫిల్మీ క్రిటిక్‌గానీ, సినీ పరిశ్రమ వ్యక్తులుగానీ ఉండరు. సినీ పరిశ్రమలో అడుగు పెట్టిన ప్రతిఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా ఈ అవార్డు తీసుకోవాలని కలలు గంటుంటారు. మరికొంత మంది ఈ అవార్డుని సొంతం చేసుకోవాలనే కల కూడా సాహసమనే భావిస్తారు.

ప్రపంచ వ్యాప్తంగా సినీ పరిశ్రమలో ఇచ్చే అత్యున్నత పురస్కారం ఈ ఆస్కార్ అవార్డు. ఇది ఏ ఒక్క దేశానికో, ఏ ప్రాంత ఇండస్ట్రీకో పరిమితమైనది కాదు. యావత్ ప్రపంచానికి చెందిన సినీ పరిశ్రమ అన్ని శాఖలకు సంబంధించిన అత్యున్నత పురస్కారం ఇది.

ఆస్కార్ అవార్డు చలన చిత్రరంగంలో యావత్ ప్రపంచంలో ప్రతిభ కనబర్చిన నటీనటులకు, దర్శకులకు, ఇతర సాంకేతిక నిపుణులకు ఇచ్చే ప్రతిష్టాత్మక బహుమతి. దీని ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా అనేక కోట్ల మంది వీక్షిస్తారు.

### తొలి ఆస్కార్

మొదటిసారి ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవం మే 16, 1929లో హాలీవుడ్ హోటల్ రూజ్‌వెల్ట్‌లో జరిగింది. 1927, 1928 సంవత్సరాలలో చలన చిత్ర రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన వారిని సన్మానించడం కోసం నటుడు డగ్లస్ ఫేర్‌బాన్, విలియం డిమేలి కలిసి దీనిని ఏర్పాటు చేశారు.

### ఆస్కార్ పేరెలా వచ్చింది?

ఆస్కార్‌గా పిలవబడే అకాడమీ అవార్డ్స్ అసలు పేరు "అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెన్". 1939లో అధికారికంగా అకాడమీ అవార్డులను ఆస్కార్‌గా స్వీకరించటం జరిగింది. ఈ సంస్థలో పనిచేసే మార్గరేట్ హేరిక్ అనే మహిళ తొలిసారి ఆస్కార్ ప్రతిమను చూసినపుడు అది తన మామయ్య ఆస్కార్‌లా ఉందన్నారు. అలా అకాడమీ అవార్డ్స్‌కు ఆస్కార్ అనే పేరు వచ్చిందని చెబుతారు.

ద అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు పది వేల మంది ఫిల్మ్ మేకర్స్, ఇతర సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారు.

### ఎలా ఎంపిక చేస్తారు?

ప్రతి సంవత్సరం అన్ని దేశాల సినిమాల నుండి మంచి సినిమాలను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన సినిమాలకు ఈ 10 వేల మంది ఓట్లు వేస్తారు. ఈ 10 వేల మందిని 17 విభాగాలుగా విభజిస్తారు. ఏ విభాగానికి సంబంధించినవారు ఆ విభాగానికి ఓటు వేస్తారు. దర్శకులు దర్శకులకి; నిర్మాతలు నిర్మాతలకి అన్నమాట. అత్యుత్తమ చిత్రానికి మాత్రం మొత్తం పది వేల మంది ఓటు వేస్తారు.

ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్‌కి అన్ని దేశాల సినీ వర్గాలు పాల్గొంటాయి. అంతేకాకుండా ఈ ఆస్కార్ అవార్డ్స్ వేడుకల్లో అన్ని దేశాలవారు తమ తమ ప్రతిభను కనబరుస్తారు. ఇటలీ, ఫ్రాన్స్, జపాన్, స్పెయిన్ దేశాల సినిమాలకు అధిక సంఖ్యలో ఆస్కార్ అవార్డ్స్ పొందిన దేశాలుగా పేరు పొందాయి.

### ఇండియన్ ఆస్కార్ విజేతలు

2016 వరకు మొత్తం 11 మంది భారతీయులు ఆస్కార్ అవార్డ్స్‌కు నామినేట్ అయ్యారు. అందులో 6గురు విజేతలుగా నిలిచారు.

1983లో 'గాంధీ' సినిమాకుగాను భాను అథియా తొలిసారి మహిళా ఆస్కార్ అవార్డ్ గ్రహీతగా పేరు పొందారు.

1992లో 'సత్యజిత్‌రే' ఆస్కార్ అవార్డ్‌ను స్వీకరించారు.



2009లో 'స్లమ్ డాగ్ మిలియనీర్'లో 'జయహో' అనే పాటకుగాను మొత్తం మూడు ఆస్కార్ అవార్డ్స్ వచ్చాయి. అందులో 'రసూల్ పూకుట్టి'కి బెస్ట్ సౌండ్ మిక్సింగ్ అవార్డు రాగా, 'గుల్జార్', 'ఎ.ఆర్.రెహమాన్'కు కలిపి బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డ్, ఇంకా ఎ.ఆర్.రెహమాన్‌కు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ అవార్డ్ వచ్చాయి.

## ఎవరెవరికి ఇస్తారు?

ఆస్కార్ అవార్డ్స్‌ను మొత్తం ఇరవైనాలుగు కేటగిరీల్లో ఇస్తారు. బెస్ట్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రెస్, బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్, బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెసెస్, బెస్ట్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్, బెస్ట్ సినిమాటోగ్రఫీ, బెస్ట్ కాస్ట్యూమ్ డిజైన్, బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ డాక్యుమెంటర్ సబ్జెక్ట్, బెస్ట్ ఫిల్మ్ ఎడిటింగ్, బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్, బెస్ట్ లైవ్ యాక్షన్, బెస్ట్ మేకప్-హెయిర్ స్టైలింగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్, బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్, బెస్ట్ సౌండ్ ఎడిటింగ్, బెస్ట్ సౌండ్ మిక్సింగ్, బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్, బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్ ప్లే.

## ఆస్కార్ ప్రతిమ

ఆస్కార్ ప్రతిమను శిల్పి జార్జ్ స్టాన్లే తయారు చేశారు. ఆస్కార్ అవార్డ్ బొమ్మను బ్రాంజ్ మెటల్ మీద 24 కారెట్ల బంగారపు పూతతో తయారు చేస్తారు. ఇది 13 1/2 అంగుళాల పొడుగు, 8 1/2 పౌండ్ల బరువు కలిగి ఉంటుంది. ఆస్కార్ అవార్డ్‌కి మొత్తం 5 స్పోక్స్ ఉంటాయి. ఇవి 5 ప్రధాన విభాగాల్ని సూచిస్తాయి. నటీనటులకు, దర్శకులు, నిర్మాతలు, రచయితలు, సాంకేతిక నిపుణులు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో లోహం కొరత ఏర్పడింది. దీనితో 3 సంవత్సరాల పాటు ఆస్కార్ ప్రతిమలను పెయింటెడ్ ప్లాస్టర్‌తో తయారు చేశారు. అప్పట్లో అవార్డులు అందుకున్న వారికి యుద్ధం ముగిసాక ఆస్కార్ ప్రతిమలను వెనక్కి తీసుకుని లోహపు ప్రతిమలను ఇచ్చారు.

1929 సంవత్సరంలో మొదటిసారి ఆస్కార్ అవార్డ్స్ ఇవ్వటం మొదలు పెట్టారు. ఈ అవార్డ్స్‌ని ఇవ్వడానికి కొత్త ఆర్గనైజేషన్ స్థాపించారు. దానిపేరు 'ద అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్'. దీనిని ఈ రోజుల్లో 'ద అకాడమీ' అని పిలుస్తున్నారు. ఈ ఆర్గనైజేషన్ ఇచ్చే ఆస్కార్ అవార్డ్స్‌ని 'ద అకాడమీ అవార్డ్స్' అని కూడా అంటారు.

1929లో హాలీవుడ్‌లో చాలా పుకార్లు తలెత్తాయి. డ్రగ్స్, మర్డర్ లాంటి పుకార్లు వచ్చేవి. వీటితో పాటు సినిమాలు తీసే ప్రొడక్షన్ కంపెనీలకి లేబర్ ప్రాబ్లమ్స్ వచ్చేవి. కూలీలు ఎక్కువ జీతం అడుగుతారేమోనని ప్రొడక్షన్ కంపెనీలకి భయం పట్టుకుంది. 1929లో అమెరికాలో స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ఆర్థిక వ్యవస్థ పతనమయ్యింది. నిరుద్యోగం ఎక్కువైంది. అలాంటి సమయంలో మెట్రో గోల్డ్‌విన్ మేయర్ అనే ఫిల్మ్ కంపెనీ రైటర్లు, డైరెక్టర్లు, టెక్నీషియన్లతో ఒక అకాడమీ స్థాపించాలని భావించారు. వాళ్ల చేసే పనికి అకాడమీ ద్వారా అవార్డు ఇవ్వాలనుకున్నారు. కానీ






సంవత్సరాలు గడిచేకొద్దీ ఈ అవార్డ్స్‌కి బాగా ప్రాచుర్యం లభించింది. 1956 బెస్ట్ ఫారిన్ లాంగ్వేజీ సినిమా, అవార్డ్‌ని కొత్తగా ఆస్కార్ అవార్డ్స్‌లో ప్రవేశపెట్టారు. ఈ కేటగిరీలో యూరోపియన్ దేశాలు ఎక్కువగా అవార్డు దక్కించుకున్నాయి. ముఖ్యంగా ఇటలీ మొదటి (14 సార్లు)స్థానంలో వుంది. ఈ విభాగంలో ఇండియా ఒక్క అవార్డు కూడా పొందలేకపోయింది. కానీ మూడు భారతీయ చలనచిత్రాలు ఈ విభాగంలో నామినేట్ అయ్యాయి. 1957లో 'మదర్ ఇండియా', 1988లో 'సలాం బాంబే', 2001లో 'లగాన్' ఇవి కాక హాలీవుడ్‌కి సంబంధించిన టాప్-5 కేటగిరీలున్నాయి. అవి బెస్ట్ పిక్చర్, బెస్ట్ దర్శకుడు; బెస్ట్ యాక్టర్, బెస్ట్ యాక్ట్రెస్, బెస్ట్ స్క్రీన్ ప్లే. వీటిని బెస్ట్-5 అంటారు.

ఏదైనా సినిమా బెస్ట్-5 గెలవాలంటే కొన్ని నిబంధనలున్నాయి. అవేమిటంటే లాస్ ఏంజెల్స్ కౌంటీ, ద సిటీ ఆఫ్ న్యూయార్క్, ద బే ఏరియా, షికాగో, ఎల్లినాయిస్, మియామీ ఫ్లోరిడా, అట్లాంటా, జార్జియాలో ఏదో ఒక చోట బరిలో ఉన్న సినిమా థియేటర్లో ఒక వారం రోజులు ప్రదర్శించాలి. జనవరి 1 నుండి డిసెంబరు 31 వరకు కమర్షియల్ థియేటర్‌లో ప్రదర్శించాలి. ఇదంత కష్టతరం కాదు. అమెరికన్ థియేటర్స్‌లో వారం రోజులు అన్ని చిత్రాలు ప్రదర్శితమౌతాయి. కొన్ని అవార్డు విభాగాలకు మినహాయింపు ఇచ్చారు. డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్‌ని ఫిలిమ్ ప్రొడ్యూసర్స్ అఫిషియల్‌గా నమోదు చేసుకుంటారు. ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీకి సంబంధించి ఆ చిత్రం మాతృదేశం అధికారికంగా పంపాలి. ఏదైనా ఒక్క సినిమానే పంపాలి. ఈ సంవత్సరం (2023) 'ద లాస్ట్ ఫిల్మ్ షో' అనే గుజరాతీ సినిమాను ఆస్కార్స్‌కి పంపారు.

ఆస్కార్స్‌లో ఈ సినిమా షార్ట్ లిస్ట్ అయింది. కానీ నామినేట్ అవలేదు. అసలు షార్ట్‌లిస్ట్ నామినేషన్ మధ్య తేడా ఏమిటంటే- ఆస్కార్స్ వచ్చిన సినిమాలన్నీ ఒక లిస్టు తయారు చేస్తారు. దీనిని రిమైండర్ లిస్ట్ అంటారు. ఈ సంవత్సరం 301 సినిమాలున్నాయి. ఈ లిస్టులో మన దేశానికి చెందిన ఆర్‌ఆర్‌ఆర్, కాంతార, గంగూబాయి, రాకెట్రీ, లాస్ట్ ఫిల్మ్ షో, కష్మీర్ ఫైల్స్ చిత్రాలున్నాయి.

301 రిమైండర్ లిస్ట్ నుండి 15 సినిమాలను షార్ట్ లిస్ట్ చేశారు. ఇందులో భారత్‌కు చెందిన లాస్ట్ ఫిల్మ్ షో స్థానం దక్కించుకుంది.
ఈ 15 షార్ట్ లిస్ట్ చిత్రాల్లో ఐదింటిని నామినేట్ చేశారు. అవార్డు ఫంక్షన్లో ఈ ఐదు సినిమాలను ప్రకటించి, వాటిలో ఒక సినిమాను ఆస్కార్ విజేతగా ప్రకటిస్తారు.
అర్హత, షార్ట్‌లిస్ట్, నామినీ, విజేత.. ఇది ఆస్కార్ అవార్డ్ అందుకోవడానికి జరిగే ప్రక్రియ. ఎంపిక చెయ్యటం ఓటింగ్ పద్ధతి ద్వారా జరుగుతుంది. 10 వేల మంది సినీ పరిశ్రమకు చెందిన వివిధ శాఖల వ్యక్తులు అంటే దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, రచయితలు.. ఇలా 17 విభాగాలుంటాయి.
ఇక్కడ సింపుల్ మెజారిటీ ఓటింగ్ పద్ధతిలో అంటే ఎక్కువ ఓట్లు వచ్చినవారికి ఆస్కార్ అవార్డ్ లభిస్తుంది. కానీ అత్యుత్తమ చిత్రానికి 'ర్యాంక్‌డ్ చాయిస్ ఓటింగ్ మెథడ్' ద్వారా ఎంపిక చేస్తారు. దీనిని 'ప్రిఫరెన్షియల్ బ్యాలెట్' అని కూడా అంటారు.
ఈ ఆస్కార్ అవార్డ్ గెలుచుకున్నవారు ఈ ట్రోఫీని ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోకూడదు. ఒకవేళ ఎవరైనా దీనిని అమ్మాలంటే దీనిని అకాడమీకి ఒక డాలర్‌కి అమ్మాలి.

### భారత్‌లోనూ, విదేశాల్లోనూ.. చరిత్ర సృష్టించిన 'ఆర్ఆర్ఆర్'

సినిమాలో 'నాటు నాటు' పాటకు 95వ అకాడమీ అవార్డ్స్‌లో ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డ్ దక్కించుకుంది. తెలుగు సినిమా ఖ్యాతి యావత్ ప్రపంచం గుర్తించింది. అందరూ ఎదురు చూసిన కల నెరవేరింది. యావత్ భారతదేశం సంతోషంతో పులకరించిపోయింది. అందరి ఆశలను మోసుకుంటూ లాస్ ఏంజెల్స్‌లో ఆస్కార్ బరిలోకి అడుగుపెట్టిన 'ఆర్ఆర్ఆర్' ఆస్కార్ విజేతగా నిలిచింది. ఈ 'నాటు నాటు' పాటకు ఆస్కార్ లభించడం యావత్ ప్రపంచం హర్షం వ్యక్తం చేసింది. ఎనిమిది దశాబ్దాలు దాటిన తెలుగు సినీ చరిత్రలో ఇప్పటివరకూ ఏ తెలుగు సినిమాకూ రాని ప్రపంచ స్థాయి గుర్తింపు ఇది. దీనిపై యావత్ తెలుగు ప్రజల సంతోష సంబరాలు



జరుపుకుంటున్నారు. ఈ పాటకు సంగీతం అందించిన పద్మశ్రీ ఎం.ఎం.కీరవాణి, పాటను రాసిన చంద్రబోస్ ఆస్కార్ అవార్డు స్టేజీ మీద అందుకోవటం విశేషం. 95వ అకాడమీ అవార్డులో ఒరిజినల్ సాంగ్ విభాగంలో 81 పాటలు పోటీ పడగా, 15 పాటలు షార్ట్ లిస్ట్ అయ్యాయి. అందులో నుంచి 5 పాటలు నామినేట్ చేశారు.
ఫిక్షనల్ పీరియాడిక్ సినిమాగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఆర్ఆర్ఆర్' సినిమాలో 'నాటు నాటు' పాటలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ కలిసి డాన్స్ చేశారు. ఈ పాటను రాజమౌళి 17 రోజుల పాటు చిత్రీకరించారు. 150 మంది డాన్సర్స్ పాల్గొన్న ఈ పాటను 200 మంది యూనిట్ సభ్యులతో చిత్రీకరించారు. ఈ పాటకు ప్రేమ్ రక్షిత్ నృత్య దర్శకత్వం వహించగా, రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడారు.
రాజమౌళి ఈ పాటను ఉక్రెయిన్‌లో చిత్రీకరించారు. 4.35 నిమిషాల కంటే ఎక్కువ రన్ టైంలో దేశీయ సంగీతంలో వినోద స్ఫూర్తిని ప్రదర్శించే పాట కైవ్(ఉక్రెయిన్)లోని ప్రెసిడెన్షియల్ ప్యాలెస్ లాన్‌లపై చిత్రీకరించారు. దీనిని మారిన్స్ ప్యాలెస్ అంటారు. నిజానికి రష్యా ఉక్రెయిన్‌పై దండెత్తడానికి కొద్ది రోజుల ముందు ఈ పాట చిత్రీకరించారు. ఈ భవనం ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అధికారిక నివాసం.

### నాటు నాటు పాటకు ఆస్కార్ ఎలా వచ్చింది?

మన తెలుగు పాటకు 95వ అకాడమీ అవార్డ్స్‌లో చోటు దక్కడం వెనుక సిఫార్సులు ఉన్నాయని, దేశంలో అత్యుత్తమ స్థానంలో ఉన్నవారు సిఫారసు చేశారని కొందరు భావిస్తున్నారు.
నిజానికి అలాంటివన్నీ అపోహలే. 'నాటు నాటు' పాట స్వశక్తితోనే ఒరిజినల్ సాంగ్ విభాగంలో విజేతగా నిలిచింది. ఈ పాటకు అంతకు ముందు జరిగిన 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు సైతం దక్కింది. విమర్శించేవారు ఇది గుర్తుంచుకోవాలి. ఆస్కార్, గోల్డెన్ గ్లోబు అవార్డ్స్ సిఫార్సులకు పీట వేసేవి కావు. ఆయా సంస్థలకు నియమ నిబంధనలున్నాయి. అసలు నామినేషన్ పొందాలంటే, సదరు పాట ఎంతో మందిని ఆకట్టుకోవాలి. ఎందరి నోళ్లలోనో నానుతూ ఉండాలి. అలా పాడుకునే వీలుగా అలతి అలతి పదాలుండాలి. అవి ఉన్నపుడే ఏ భాష వారైనా పాటను ఇష్టపడి హమ్ చేస్తుంటారు. ఆ పాటకు సినిమాలో తగ్గ సందర్భం ఉండాలి. పాటలో ప్రత్యేకత కూడా చొప్పించాలి. ఈ నామినేషన్ పొందిన మిగతా పాటలను పోల్చి చూస్తే అవి నేపథ్య గీతాలుగానే వినిపించాయి. అయితే వాటికి భిన్నంగా మన పాటలో డాన్సు ఉంది. మన నేటివిటీ, మన జానపద పదాలతో కూడిన ఒరిజినాలిటీ వుంది. ఈ పాటను తెలుగు తెలియనివారు సైతం తెరపై చూడగానే చిందులు వేశారు. పరభాషలవారు సైతం పాట వినగానే 'నాటు..నాటు' అంటూ హమ్ చేశారు. ఈ పాటలో తెలుగుదనం ఉట్టిపడేలా పదాలు చోటు చేసుకున్నాయి. అందుకు తగ్గట్టు స్వరకల్పన సాగింది. నృత్యరీతులు ప్రత్యేకత సంతరించుకున్నాయి. ఇలా.. ఎలా చూసినా మిగతా పాటల కన్నా



అకాడమీ నియమ నిబంధనలకు అనువుగానే 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించింది.
ఈ యాక్షన్ ఎపిక్‌లో రెండు ప్రధాన పాత్రలు రామ్‌చరణ్, ఎన్టీఆర్. వలస రాజ్యాల కాలంలో బ్రిటీష్‌వారి పార్టీకి ఆహ్వానించబడ్డ ఏకైక భారతీయులుగా, బెదిరింపులకు గురైన తర్వాత వారి నృత్య నైపుణ్యాలను ప్రదర్శించినపుడు చిత్రంలో ఈ పాట మొదలవుతుంది. 'నాటు అంటే జాతి' అని అర్థం. కొరియోగ్రాఫర్ ప్రేమ్‌రక్షిత్ ఈ పాట కోసం హుక్ స్టెప్ కోసం 100 వైవిధ్యాలతో వచ్చాడని రాజమౌళి చెప్పారు.
ఏది ఏమైనా ఇన్నాళ్లూ అందని తాయిలంలా అమెరికాలో కూచున్న ఆస్కార్ అవార్డు ఒరిజినల్ తెలుగు సినిమా పాటకు రావటం చరిత్రే మరి. ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీంకి ప్రత్యేక అభినందనలు.

## 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'

95 అకాడమీ అవార్డ్స్‌లో "ద ఎలిఫెంట్ విష్పరర్స్' డాక్యుమెంటరీ షార్ట్ ఫిలిమ్స్ విభాగంలో నామినేట్ అయి ఆస్కార్ అవార్డ్ దక్కించుకుంది. 95వ అకాడమీ అవార్డ్స్‌లో ఇండియన్ సినిమాలు సత్తా చాటాయి. డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న మొదటి ఇండియన్ సినిమాగా 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' చరిత్ర సృష్టించింది.

## కథ గురించి..

డాక్యుమెంటరీ కథ విషయానికొస్తే– తమిళనాడులోని నీలగిరి అడవుల్లో 2017లో ఒక గున్నఏనుగు తల్లి నుండి తప్పించుకుని కన్పించింది. శరీరమంతా గాయాలతో చావుబతుకుల్లో ఉంది. ఆ ఏనుగును కాపాడటం కష్టమని మదుమలై టైగర్ రిజర్వ్‌లో ఉన్న తెప్పకాడు ఎలిఫెంట్ క్యాంపువాళ్లు భావించారు. కానీ ఆ ఏనుగును కాపాడతానంటూ బొమ్మన్ అనే గిరిజనుడు ముందుకొచ్చాడు. ఆ క్యాంపులో ఏనుగు బాగోగులను చూసుకోవడానికి బెల్లీ అనే మహిళ ఆయనకు అండగా నిలిచారు. ఆ ఏనుగుకు రఘు అని పేరు పెట్టారు. క్రమంగా అది వాళ్లకు బిడ్డలా మారిపోయింది. కొన్ని రోజులకు రఘు కోలుకుంది. తర్వాత 2019లో బొమ్మి అనే గున్న ఏనుగు బాధ్యతలను బొమ్మన్‌కు అప్పగించారు. ఏనుగుల బాగోగులు చూసుకుంటూ వచ్చిన వారిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఆ దంపతులకు, ఏనుగులకు ఉన్న అనుబంధాన్ని చూపించేలా 'ద ఎలిఫెంట్ విష్పరర్స్' అనే డాక్యుమెంటరీని ముంబయ్‌కి చెందిన ఫొటోగ్రాఫర్ కార్తికీ గొన్‌సాల్వేస్ 2022లో తీసారు. దీనిని నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల చేశారు. ఈ సినిమా ఈ ఏడాది అకాడమీ అవార్డ్స్‌కి నామినేట్ అయింది. ఈ డాక్యుమెంటరీతో బొమ్మన్, బెల్లీలు ఏనుగుల గురించి



ప్రపంచానికి తెలిసింది. బి.బి.సి. వీరితో ఇంటర్వ్యూ చేశారు.
ఈ డాక్యుమెంటరీ చిత్రాన్ని గునీత్ మోగన్ నిర్మించగా, కార్తికీ గోన్సాల్వేస్ దర్శకత్వం వహించారు. 41 నిమిషాల నిడివి గల ఈ డాక్యుమెంటరీ సాధించిన ఆస్కార్ అవార్డ్‌ని దర్శకురాలు కార్తికి 'మాతృభూమి భారతదేశానికి అంకితం' అన్నారు ఉద్వేగంగా.

## 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఎన్ని అవార్డులు?

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా ఇప్పటివరకూ 15 ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఆస్కార్ అవార్డుతోబాటు గోల్డెన్ గ్లోబ్(జిజిఎ), క్రిటిక్స్ ఛాయిస్ మూవీ అవార్డ్స్(సిసిఎమ్ఎ), లాస్ ఏంజిల్స్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డ్ (ఎల్ఎఎఫ్‌సిఎ), సౌత్ ఈస్టర్న్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డ్ (ఎస్ఇఎఫ్‌సిఎ), సాటర్న్ అవార్డ్(ఎస్ఎ), న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ ఆన్‌లైన్ అవార్డ్(ఎన్‌వైఎఫ్‌సిఓ), న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్(ఎన్‌వైఎఫ్‌సిసి), హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డు(హెచ్‌సిఎ), అట్లాంటా ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్(ఎఎఫ్‌సిసి), జార్జియా ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అవార్డు(జిఎఫ్‌సిఎ), బోస్టన్ సొసైటీ ఆఫ్ ఫిల్మ్ క్రిటిక్స్ అవార్డు(బిఎస్ఎఫ్‌సి), ఆస్టిన్ ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్(ఎఎఫ్‌సిఎ), అలయెన్స్ ఆఫ్ ఉమెన్స్ ఫిల్మ్ జర్నలిస్ట్ ఆర్గనైజేషన్ (ఎడబ్ల్యుఎఫ్‌జె).
ప్రపంచం నోట తెలుగుపాట
'పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు, పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్టు..' అంటూ అంతర్జాతీయ ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాట నాట్యంతో చిందులేసి ఊగిపోయింది. ప్రపంచ దేశాల అభిమానుల నోట భాషా భేదం లేకుండా 'నాటు నాటు' దద్దరిల్లింది. తెలుగువాడికి తప్ప, అన్యులకు అర్థంకాని ఈ పాట ప్రపంచాన్ని ఉర్రూతలూగించింది.
వాస్తవానికి ఆస్కార్ గెలుపు ఒక్క 'నాటు నాటు' పాటకి కాదు.. తెలుగు భాషది, తెలుగు జాతిది. సంగీతానికి భాషతో, భావంతో పనిలేదు. తెలుగు మట్టివాసన ప్రపంచ గుండెల్ని తట్టి లేపింది. ఇది అరుదుగా సంభవించే కలయిక.
చంద్రబోస్ రాశారు; కీరవాణి సంగీతం అందించారు; రాజమౌళి తీశారు; ప్రేమ్‌రక్షిత్ నృత్యరీతులు సమకూర్చారు? ఎన్టీఆర్, రామ్‌చరణ్ నర్తించారు; రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడారు. అంతే! ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు కలిపి.. అకాడమీ వారికి రుచి చూపించి కల అనుకునే 'ఆస్కార్' అవార్డులను తెలుగు తల్లికి తెచ్చి చరిత్ర సృష్టించిన రాజమౌళి చిత్ర బృందానికి; కార్తికీ గోన్‌సాల్వేస్ చిత్ర బృందానికి అభినందనలు తెలుపుదాం! చెయ్యెత్తి జై కొట్టిన తెలుగుతల్లి ముద్దుబిడ్డలకి జేజేలు పలుకుదాం!! ❑

# మనసుంది చూసారూ మనసు..

**ఓ రాజ్యానికో రాజు. ఆయన ఓ పిల్లిని ఎంతో ఇష్టంగా పెంచుకున్నాడు. అదంటే ఆయనకు తెగ ముద్దు.. ముచ్చట. ఆయనకో విచిత్రమైన అలవాటు ఉండేది. అదేంటంటే-**

రాత్రిపూట ఆ పిల్లి తల మీద ఓ దీపాన్ని వెలిగించి పెట్టేవాడు.
పిల్లి తన మీద పెట్టిన దీపాన్ని కింద పడకుండా చూసుకునేది.
తలను అటూ ఇటూ కదల్చకుండా రాజు వెంటనే నడిచి వెళ్లేదా పిల్లి. రాజు ఆ దీపం వెలుగులో తన పనులు కానిచ్చుకునేవాడు. ఆయనకు అదో ఆనందం, పిచ్చి ఆనందం.
ఇందువల్ల ఆ రాజు చీకట్లో విడిగా ఓ దీపం చేత్తో పట్టుకుని వెళ్లివలసిన అవసరం ఉండేది కాదు.
దీపాన్ని తల మీద ఉంచుకుని సాగే పని పిల్లి చూసుకునేది. అందువల్ల ఆ పిల్లి అంటే రాజుకు ఎంతో ఇష్టం.
రాజు మంత్రులందరినీ పిలిచి వారితో "చూసేరా, ఈ పిల్లి ఎంత విశ్వాసమైనదో. నేనంటే దానికెంత మర్యాదో, అభిమానమో" అని గొప్పగా చెప్పుండేవాడు.
ఆయన చెప్పినదంతా విన్న మంత్రులలో ఒకతను లేచి "రాజా, మీరు చెప్పేది సబబే. కాదనం. అయినా ఆ పిల్లి విశ్వాసాన్ని పరీక్షించాలని ఉంది. మీరు అందుకు అవకాశం ఇస్తారా?" అని అడిగాడు నెమ్మదిగా.
"సరే, నీ ఆశను ఎందుకు కాదంటాను, అలాగే పరీక్షించు" అని చెప్పాడు రాజు.
వెంటనే ఆ మంత్రి ఎక్కడికో బయలుదేరాడు. కొద్దిసేపైన తరువాత ఓ అయిదారు ఎలుకలను పట్టుకొచ్చాడు.
కోటలో రాజు ఏదో పని చేసుకుంటున్నాడు. రాజు పక్కనే ఆయన ముద్దుల పిల్లి ఎంతో వినయ విధేయతలతో నిల్చుని ఉంది. దాని తల మీద దీపం వెలుగుతోంది.
మంత్రి తాను పట్టుకొచ్చిన ఎలుకలను ఆ పిల్లి చూసేలా కిందకు విడిచి పెట్టాడు. ఆ ఎలుకలు అటూ ఇటూ పరుగులు పెట్టాయి.
తల మీదున్న దీపాన్ని కింద పడేసిన పిల్లి ఎలుకల వెంట పడింది.. దీపం ఆరిపోయింది.
చీకట్లో రాజు తడబడ్డాడు.
ఈ సమయంలో ఆ మంత్రి మళ్లీ దీపాన్ని వెలిగించాడు. వెలుగు వచ్చింది.
అప్పుడు మంత్రి "రాజా, పిల్లి విశ్వాసాన్ని చూసేరా, ఎలుకలు కనిపించనంతవరకూ అది విశ్వాసంతో ఉన్నట్టే ప్రవర్తించింది. ఎప్పుడైతే ఎలుకలు కనిపించాయో అన్నింటినీ విడిచిపెట్టి వాటిని పట్టుకోవడానికి వెంట పడిందన్నాడు.
దాంతో తనకు పిల్లి మీదున్న అభిప్రాయం తప్పని తెలుసుకున్నాడు రాజు. మంత్రితో తన తప్పు ఒప్పుకున్నాడు.



సరేగానీ, ఇప్పుడీ కథంతా ఎందుకు అని అడగొచ్చు.
ఈ పిల్లి లాంటిదే మన మనసు.
మనసుకి ఎంతగా శిక్షణ ఇచ్చి అది మన గుప్పెట్లో ఉందని అనుకున్నా అదొక అమాయక ప్రాణిలా అనిపించినా అది చూడకూడనిదేదో చూసి దాని మీద దృష్టి పెట్టిందంటే అప్పటివరకూ మన నియంత్రణలో ఉందనుకున్న మనసు అన్నింటినీ పక్కన పెట్టి తనకిష్టమున్న వైపు పారిపోతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.
అంతెందుకు.. మహామహులు అనుకున్న మునుల జీవితాల్లోనూ ఇలాంటివెన్నో సంఘటనలు జరిగాయని అప్పుడప్పుడూ చదువుతూ ఉంటాం. లేదా చెవిన పడుతూ ఉంటాయి. మనసుని నియంత్రించడంలో ఎంత పట్టుగా ఉన్నా అది ఏదో సమయంలో నువ్వెవరివి అంటూ కట్లు తెంచుకుని పరుగులు తీసి మనల్ని అయోమయంలో పడేస్తుంది.



ఒకడు ఇక మీదన చచ్చినా మద్యం సేవించకూడదనుకుంటాడు. ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ మద్యం దుకాణం చూడటంతోనే మనసు, కాళ్లు అటే పోతాయి.
అదే మనసన్నది. అదే ఆ రాజు పెంచిన పిల్లి.
నాకు తెలిసిన ఓ మనిషున్నాడు. అతను ఆ రాజులా తన తల మీద దీపం పెట్టుకుని ఏదో వెతుకుతున్నాడు. తలను అటూ ఇటూ తిప్పకుండా చాలా సేపటినుంచి వెతుకుతున్నాడు.
సరిగ్గా ఆ సమయంలో ఒకడు "ఏమిటి? వెతుకుతున్నారు?" అని అడిగాడు.
"అదేనండీ! మరచిపోయాను" అన్నాడితను.
"సరే, కాస్త ఇలా కూర్చోండి, జ్ఞాపకం వచ్చాక మళ్లీ వెతకండి" అన్నాడతను.
అతను సరేనని కూర్చుని ఆలోచించాడు. కాసేపటికి అతను "జ్ఞాపకం వచ్చిందండి" అన్నాడు.
"ఏమిటి?" అని అడిగాడతను.
"మా ఇంట్లో ఈ దీపాన్ని ఎక్కడ ఉంచానో తెలీలేదు. దాన్నే వెతుకుతున్నాను, దీపం వెలిగిద్దామని" అన్నాడు.

**- యామిజాల జగదీశ్**



# అతివల కొత్త ఫ్యాషన్



**మన** ముత్తవ్వ, అమ్మమ్మల కాలంనాటి ఫ్యాషన్స్ మళ్లీ వస్తున్నాయి. పాపిడిబిళ్ల, చెంప స్వరాలు, వంకీ, వడ్డాణం, పొట్టి, పొడుగు బుట్ట చేతుల జాకెట్లు, బెత్తెడు వీపు వెనుక ముడి వేసే జాకెట్, రోడ్లు ఊడ్చే చీరకొంగులతో రాంప్‌వాక్‌తో ఒంపు సొంపుల ప్రదర్శన టి.వి.లో చూస్తూ గులకరాళ్ల గలగల మాటలు వింటూ యాంకర్స్‌ని అదరగొట్టే అతివల కాలం ఇది.

వాణిశ్రీ గోపురం లాంటి కొప్పు, సాధనా కటింగ్ బౌఫంట్ శిరోజాలంకరణ 1960-70లో జనాల్ని ఊపేసాయి. శిరోజాలంకరణ 18వ శతాబ్దిలో ఫ్రాన్స్‌లో మొదలైంది. కానీ మన అజంతా, ఎల్లోరా శిల్పాల్లో ఎత్తు కొప్పులు, ముడులు వేసిన వాళ్లలో మన శివుడు కూడా ఉన్నాడు కదా. బుద్ధుడు, నారదుడు ఎంచక్కా కొప్పులున్నవారే కదా. పుష్కర స్నానాలకొచ్చే సాధు సన్యాసుల అట్టలు కట్టిన కొప్పులు నేలను తాకే జుట్టు చూస్తున్నాం కదా!

ఫ్రెంచ్ రాణీమేరీ ఆంటోనేట్ జుట్టు పల్చగా, తక్కువగా ఉండేది. అందుకే బంగారు పిచ్చుక రంగు కొప్పు అచ్చు ఆ గూడుని నెత్తిన అలంకరించుకునేది. మగాళ్లు సుర్మా; స్త్రీలు కాటుక, ఆముదం కర్పూరం వేసి ఇంట్లో తయారు చేసి పెట్టుకునేవారు. బొట్టూ, కాటుక పెట్టుకుని పూవుల దండలు ముడుచుకుని తూనీగల్లే ఎగిరే భామలు లేరిప్పుడు.

హైటెక్ జుట్టు విరబోసుకునే చెంపలకి గడ్డం మీసంలా కత్తిరించుకున్న జుట్టు వేలాడ్తుంటుంది.

క్వీన్ క్లియోపాత్రా, మార్లిన్ మన్రో, ఐశ్వర్యారాయ్‌లాగా కెమికల్స్‌తో తయారైన ఐ-లైనర్‌ని కంటికి వాడ్తున్నారు. దుస్తులు, కాలిజోళ్ల మ్యాచ్ అయ్యే రంగుల షేడ్స్‌ని కనుపైరెప్పలకి దిద్దుతున్నారు. కెమికల్స్ కలిసిన లిప్‌స్టిక్స్ నీలం, నలుపుతో వాడ్తున్నారు, నెయిల్ పాయిల్‌తో మ్యాచ్ అయ్యేలా.

లిటిల్ బ్లాక్ డ్రెస్ అనే హాలీవుడ్ ఫ్యాషన్ 1950-60లో రాజ్యం ఏలింది. కరీనాకపూర్ బ్లాక్ డ్రెస్ బంగారు రంగు బెల్టుతో మెరిసిపోయింది.



విక్టోరియా కాలంనాటి దుస్తుల్ని లేసుల్తో కుట్టినవి ఉన్నత వంశీయులే వాడేవారు. చీరెలు, జాకెట్లు, చీరెలోపలి లంగాలకి లేసులు కుట్టేవారు. నాగరం, చామంతిబిళ్లలతో బాపుబొమ్మలా ఆడపిల్లలు జడకుచ్చులు/జడకుప్పెలు ఇప్పుడు పెళ్లి, ఫంక్షన్స్‌లో చిన్నా పెద్దా అందరూ వాడ్తున్నారు.

సవరం వేసి మరీ పూలు ముడ్తున్నారు. ఒకప్పుడు సావిత్రి, గిరిజ, జమున రెండు జడలతో ఛెంగు ఛెంగున ఆడేవారు. రెండు జెళ్ల సీతలు ఇప్పుడు కేవలం యూనిఫాం స్కూలు అమ్మాయిలే మరి!

లేడీ డాక్టర్, లాయర్ రింగు బన్నుతో సిగ చుట్టి ముద్దబంతుల్లా ఉండేవారు. క్రమంగా బారెడు జుట్టు కాస్తా బెత్తెడు తోకైంది. క్రమంగా పోనీటైల్ ప్రచారంలోకి వచ్చింది. కొందరు రబ్బరుబ్యాండు క్లిప్‌తో సరిపెడుతున్నారు. టి.వి.ఛానల్స్ పుణ్యమా అని ప్యాంటు, షర్ట్‌తో మగదుస్తుల్లో నేటి పిల్లలు, ఒక చెవి దిద్దుతో, ఆడపిల్లల జుట్టుతో హిప్పీ అబ్బాయిలు. క్రాపింగ్‌తో కొబ్బరినూనె ఖర్చు తగ్గింది.

గంటలకొద్దీ చిక్కు తీసే శ్రమ పోయింది. లంచన్‌గా స్కూటీపై తరుణి హరిణిలాగా దూసుకుపోతోంది. హెల్మెట్ పెట్టుకోవటంతో హ్యాండ్‌బ్యాగ్ లో దువ్వెన బుల్లి అద్దం, సైడ్ క్లిప్పుల తో తేలికైంది తల అలంకారం.

రానున్న కాలంలో ఇంకెన్ని కొత్త కొత్త ఫ్యాషన్స్ వస్తాయో! చూడాలి మరి.

**- అచ్యుతుని రాజశ్రీ**



# యాంటిక్స్

కొత్తింటికి మారబోతూ
ఇల్లు సర్దుకుంటున్నారు.
పాత సామాన్లు
తీసెయ్యాలన్నాడు అబ్బాయి.
ఈ ఉత్తరాల కట్ట/ మా నాన్న రాసినవిరా అందామె.
వాటిలో ఆనాటి/ మమకారం అంతా నిండి వుంది.
ఈ బొంతను/ మా అమ్మా అమ్మమ్మా కలిసి కుట్టారు
దీన్ని పారెయ్యడానికి వీల్లేదు.
ఈ క్యాసెట్లలో/ అపురూపమైన పాటలున్నాయి
చెత్తబుట్టలో వేస్తానంటే ఎలా!/ ఈ బుద్ధుని ప్రతిమ
నాకు నిమీలిత తత్వాన్వేషణను నేర్పింది.
నీ చిన్నప్పటి ఫొటోరా యిది
కొట్టడానికి
నీ కొత్త గోడలకు ఇష్టం లేదంటావా?
ఈ కుర్చీ మాత్రం తియ్యనివ్వను
దీని చుట్టూ/ కనబడని అనుభూతుల తీగలున్నాయి.
ఇంగ్లాండులో/ షేక్స్పియర్ నాటకం రాసిన
టేబుల్‌ను భద్రపరిచారు/ ఈ బల్ల నాతో
ఏమ్మాట్లాడుతుందో మీకర్థం కాదు.
యాంటిక్‌ల పిచ్చి/ ఏంటమ్మా నీకు!
వీటికిప్పుడు జాగా లేదు.
మనిల్లు నీ యిల్లుగా/ మారుతున్నప్పుడు
నాకు మాత్రం / స్థలం ఎక్కడుంటుందిరా!
బాబూ!/ జ్ఞాపకాలే జీవితం
అవి గతించినవి కాదు
నడకకు కొత్త గతిని నేర్పేవి/ నీకైనా నాకైనా/
చివరిదాకా/ నడిపించేవి జ్ఞాపకాలే.

**- డా॥ ఎన్.గోపి**

---

# అక్షరాలు



అచ్చతెలుగు అక్షరాలు/ అలరించే పావురాలు
అమ్మవోలె ప్రేమతోడ
దిద్దుతాయి జీవితాలు
అజ్ఞానం తరిమికొట్టు
విజ్ఞాన కాగడాల
ప్రజ్ఞను పెంపొందించే
విజ్ఞతకు ఆనవాలు
అక్షరాలు ఆయుధాలు
అంబరాన నక్షత్రాలు
భవిత బాట చూపెట్టే
నవ్యతకు సోపానాలు
అక్షరాలు నేర్చుకున్న
ఆనందం మన సొంతం
అక్షర అరుణోదయంతో
భవిత యగును ప్రశాంతం.

**- గద్వాల సోమన్న**

---

ఈ వారం కవిత్వం

# పక్షులే నయం..

ఆహారమే కాదు/ ఆలోచనలు పరాన్నమే
వారికి మెదడు ఒక చలనంలేని వస్తువు.
డబ్బులే కాదు
డాబరికం అరువు తెచ్చుకున్నదే
నిజాయితీగా ఒక్కమారూ నిలబడలేరు.
సంస్కృతి దిగుమతి/ సాంప్రదాయాలు తారుమారు
కొత్తొక వింత కాదు రోగం కూడా.
మనిషి సొంతతనం కోల్పోయాడు
పక్షులు పశువులే నయం
అస్తిత్వం వదిలేయడం లేదు ఇంకా..

**- దాసరి మోహన్**



## అమ్మలకు చెప్పిన కమ్మని కథలు



ప్రకృతి నేర్పిన పాఠాలు, పర్యావరణం చెప్పిన పాఠాలు, స్వానుభవంలోంచి నేర్చుకున్న పాఠాలు, పెద్దలు చెప్పిన పాఠాలు ఇలా 'వినదగు నెవ్వరు చెప్పిన' ఆర్యోక్తి ప్రకారం పిల్లలు చెప్పిన పాఠాలు అయినా వినదగ్గవే! ఆచరించతగ్గవే!! ఒక్కోసారి పిల్లలు చెప్పే పాఠాలు చిట్కాలు ఉపాయాలు పెద్దలనే విస్మయపరుస్తాయి. 'మనకెందుకు తోచలేదు' అని ఆశ్చర్యపరుస్తాయి.

జ్యోతివలబోజు నండూరి సుందరీ నాగమణిల సంపాదకత్వంలో వెలువడిన ఈ 'పిల్లలు చెప్పిన పాఠాలు' సంకలనంలో 77 చిన్నకథలున్నాయి. 71 మంది రచయిత్రులు, ఆరుగురు రచయితలు తమ అనుభవాల్లోంచి నేర్చుకున్న పాఠాలంత సహజంగా రూపొందించబడ్డాయి.

పిల్లలు ఏమీ తెలియనట్లున్నా, గ్రహింపు శక్తి ఎక్కువ (పే 14), చిన్నపిల్లాడయినా చిచ్చరపిడుగు (పే 30) అమ్మాపంపకాలు వద్దు. తమ్ముడి గురించి ఆలోచన చేయి (పే 97) అని ఎంతో అరిందాలా చెప్పిన కాలేజీగర్ల్ అనుపమ.

వీరందరి నుండి పెద్దలం మనం నేర్వాల్సిన పాఠాలు చక్కగా వివరించబడ్డాయి. నిజమే స్వార్థంతో పెద్దల కళ్లకు పొరలు క్రమ్మితే నిస్వార్థంతో ఆలోచించి పెద్దలకు కనువిప్పు కలిగించే కథలివి.

**(పిల్లలు చెప్పిన పాఠాలు, కథలు, సంకలనం, సంపాదకులు: జ్యోతి వలబోజు, నాగమణి, వెల: రూ 300, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- కూర చిదంబరం**

## జాతీయ, అంతర్జాతీయ వేడుకలు



జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు, జనవరి నుండి డిసెంబరు వరకు నిర్దేశించబడిన వేడుకలను లయన్, కెప్టెన్ డా॥బుర్రమధుసూదన్‌రెడ్డి 412 పేజీల ఉద్గ్రంథంగా విషయాలను ఎంతో శ్రద్ధాసక్తులతో సేకరించి క్యాలండర్ ఆఫ్ ఈవెంట్స్‌గా ప్రచురింపచేసారు. 225 దినోత్సవాలను ఎంపిక చేసి సంక్షిప్తంగా వాటి ప్రాధాన్యతను వివరిస్తూ, వాటికి సంబంధిత మౌళిక అంశాలను పొందుపరిచారు. విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ప్రయోజనకరంగా వుండేటట్టు ఈ గ్రంథం రూపొందించారు. జన్మదిన సందర్భాలు, జాతీయ అంతర్జాతీయ రంగాలలో గుర్తుంచుకోవలసిన సంఘటనలు, ఆ వేడుక లేదా సందర్భాన్ని స్మరించుకొంటూ స్ఫూర్తివంతంగా సామాజిక ప్రయోజనాన్ని సాధించే సత్సంకల్పం ఈ గ్రంథం కల్పిస్తోంది. ప్రభుత్వపరంగానో, లేదా ఐరాస వంటి ప్రపంచసంస్థలు ప్రకటించిన కొన్ని సందర్భాల తేదీలు, ఉద్యమాలు, వారోత్సవ వేడుకలు మారుతున్న కాలం గుర్తు చేసుకోవలసిన అవసరం ఈ గ్రంథం స్పష్టం చేస్తోంది. వివిధ పత్రికలలో ఆయాప్రత్యేక తేదీలలో ప్రచురింపచేసిన సంక్షిప్త విషయాల వివరణను డా॥బుర్రమధుసూదన్ రెడ్డి అందరికీ ఉపయుక్తంగా ఉండేటట్టుగా అందించడం అభినందనీయం. మధుపాళీ రచనలుగా ప్రచురించబడిన ఈ గ్రంథంలో మధుసూదన్‌రెడ్డి కవితలు కూడా చోటు చేసుకోవడం ముదావహం.

(జాతీయ, అంతర్జాతీయ వేడుకలు, రచన: డా॥ బుర్రమధుసూదన్ రెడ్డి, వెల: రూ 275, ప్రతులకు: బి.జలజారెడ్డి, ఇ.నం. 2-10, 1400/సి, మైత్రిటవర్స్- 201, జ్యోతినగర్, కరీంనగర్)

**- యర్రమిల్లి**

## పుస్తక సమీక్ష

## అక్షరం రగిల్చిన 'అగ్నిశిల్పం'



డా॥త్సవటపల్లి సత్యనారాయణమూర్తి (బాబ్జి)కి ఈ కవితా సంపుటి అంకితం చేసారు. కవి.డా॥ఏ.కె. వేణుగోపాల్ రెడ్డి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, గంటేడ గౌరునాయుడు, డా॥జంకా లక్ష్మీనారాయణ, మాడభూషి కృష్ణప్రసాద్ చక్కటి విలువైన ముందు మాటలు రాసారు. దాదాపు 41 కవితలున్నాయి. పర్యావరణం, ప్రకృతివైపరీత్యాలు, రైతుల ఆత్మహత్యలూ, స్త్రీ సమస్యలూ, రాజకీయ అవినీతి, కదలిక లేని జనం పరిస్థితులు, శ్రమజీవుల వ్యతలు ఎంతో ఆర్ద్రంగా అక్షరీకరించారు నాగరాజు. సీమ వెనుకబాటు తనం, స్త్రీల సమస్యలు చక్కగా కవిత్వీకరించిన వీరి కవితల్లో మచ్చుకు కొన్నింటిని చూద్దాం! భార్యగురించి 'జీవనశిల్పి' కవితలో ఒక చోట అద్భుతంగా రాస్తూ ఇలా అంటారు (పేజి-5) 'పైసాకు పైసాకు లెక్కకడుతుంటే/ రూపాయికి రూపాయి తోడు చేస్తుంటే! పిసినారిగా వుండటం నీతత్త్వమని/ ధారాళంగా వుండటం నీ చేతగాదని అప్పుడు అనుకున్నాను- నీవు లెక్క కట్టింది నా అవసరానికని!' అంటారు. 'ఎర్రబస్సు' (పేజి.95) గురించి రాస్తూ ఒకచోట ఇలా అంటారు. రైసుమిల్లులో ఆడాల్సిన వరిబస్తాలు/ సంతలో అమ్ముకోవాల్సిన నాటుకోడి కుటుంబాలు, రంగమ్మత్త కూరగాయల బుట్టలు/ వెంచయ్య మామకట్టెల మోపులు, సుబ్బాయమ్మగాజుల సంచులు/ మేదరయ్య వెదురుబొంగలు... ఎర్రబస్సుతో స్నేహం చేస్తూనే వుండేవి అంటారు. (అగ్నిశిల్పం, రచన: డా॥పొదిలి నాగరాజు, వెల: రూ150, ప్రతులకు: డా॥పొదిలి నాగరాజు, బద్వేలు, కడపజిల్లా)

**- తంగిరాల చక్రవర్తి**

హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో ప్రత్యేక 'గజళ్ళ' గ్రంథాల స్టాల్‌ని నెలకొల్పి, ఇటీవలే 'గజల్ సప్తాహం' విజయవంతంగా నిర్వహించి, తరచుగా తనురాసిన గజళ్లతో వివిధ మాధ్యమాల్లో తళుక్కుమంటున్న కవయిత్రి డా॥గడ్డం (గజళ్ల) శ్యామల 'శరద్వల్లరి'

## చక్కటి అనుభూతుల హరివిల్లు 'శరద్వల్లరి'



శీర్షికన ఓ తెలుగు గజళ్ళ సంపుటితో సాహితీప్రియుల ముంగిట నిలిచారు. గజళ్లనీ, శ్యామలగారిని విడి,విడిగా చూడలేము. ఆమె దృష్టిలో 'గజలంటే' ఏమిటో ఈ గజల్‌లో చూద్దాం. 'గజలంటే ప్రియురాలే..ఎదమీదే రసరాజే నీ వెపుడూ!/ వలపు పూలజల్లు కురిసి వలవేసే వలరాజే నీవెపుడూ!" యిది 'మల్లా' (మొదటి ద్విపద) 'నీలమేఘ శ్యామునితో ఊసులాడు ప్రియభూమిని/ ప్రకృతి వనములో తిరిగెడి ధైర్యశాలి! మృగరాజే నీవెపుడూ' యిది చివరి ద్విపద..లేదా' మఖ్తా. 'మత్లా', 'మఖ్తా'ల మధ్య మూడు ద్విపదలు (షేర్లు )వున్నాయి. రసరాజే, వలరాజే, నిశిరాజే, మహారాజే, కలరాజే, మృగరాజే వంటి కాఫియాతో గజళ్ళ రాజరికాన్ని చమత్కారంగా చాటిచెప్పారు. 'నీవెపుడూ' అనే అంత్యప్రాస (రదీఫ్) చక్కగా అమరి 'గజలియత్'ను వెలిగించింది. ఏకవస్తువు (గజక) గురించి రాసిన ఈ గజల్‌ను 'మూసల్‌సల్' గజల్‌గా వ్యవహరించవచ్చు. ఈ సంపుటిలో విరహం, తాత్వికత, మానవత ధ్వనిస్తున్న అరవై వైవిధ్యభరిత గజళ్లను ఆస్వాదించవచ్చు. (శరద్వల్లరి గజల్స్, రచన: డా॥ గడ్డం శ్యామల, వెల: రూ 80, ప్రతులకు: ప్లాట్ నం.203, మారుతి హైట్స్, న్యూ మయూరి నగర్, చైతన్యపురి, హైదరాబాద్)

**- రమణ వెలమకన్ని**



# అధిక కవలల జనాభా నగరం

సిహెచ్.వి.వి.రఘుబాబు

**కవలలే** కాదు కవలల నగరాలు కూడా ఉన్నాయి. ప్రపంచంలోనే కవలల జనాభా అధికంగా ఉన్న నగరం ఎక్కడ ఉందో తెలుసా? ఈ నగరంలో ప్రతీ ఇంట్లోనూ కవలలే కావడం విశేషం. ఒకే కాన్పులో కవలలు జన్మించడం మనం అరుదుగా చూస్తుంటాం. వారిలో కొందరు అచ్చం ఒకే రూపాన్ని కలిగి ఉంటారు. వారిని గుర్తుపట్టడం చాలా కష్టమైన పనే. మన కంటికి సరిగ్గా పనిచెబితేకాని వారిని పేర్లతో సహా గుర్తుపట్టడం సాధ్యం కాదు. ఒకరిద్దరు కవలలు ఉంటేనే కన్ఫ్యూజ్. అయితే ఈ నగరంలో ఇంటింటికీ కవలలు ఉంటే? అప్పుడు మన పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడమే కష్టం. ప్రపంచంలో కవలలు ఎక్కువగా ఉన్న నగరాలు అనేకం ఉన్నాయి. అయితే నైజీరియాలోని ఇగ్బో-ఓరా నగరంలో దాదాపు ఇంటింటికీ కవలలు ఉంటారు. ఇక్కడ జనాభా 2.78 లక్షలు. ప్రతీ వెయ్యి మంది జనాభాలో 200 మంది కవలలు ఇక్కడ ఉంటారు. అందుకే దీన్ని ప్రపంచంలోనే జంట రాజధాని అని కూడా పిలుస్తారు. ప్రపంచంలో బ్రెజిల్‌కు చెందిన కాండిడో గోడోయ్, ఈజిప్ట్‌కు చెందిన అబుఅత్వా, యుక్రెయిన్‌కు చెందిన వెలికాయ కోపన్యా, భారతదేశంలో కేరళ రాష్ట్రం కోడిన్హి అనే గ్రామాల్లో కవలలు ఎక్కువగా ఉన్నారు. అయితే ఇగ్బో-ఓరా నగరంలో కంటే చాల తక్కువనే చెప్పాలి. ఇక్కడ వెయ్యి జననాల్లో 200 కంటే మించిన జననాలు కవలలే కావటం గమనార్హం. నైజీరియాలోని అతి పెద్ద నగరమైన లాగోస్‌కు దక్షిణంగా 135 కిలోమీటర్ల దూరంలో ఈ ఇగ్బో-ఓరా నగరం ఉంటుంది. ఈ నగరంలో మనం ఎక్కడికి వెళ్లినా ఒకే వ్యక్తి రెండు సార్లు కనిపిస్తున్నాడా అనే భ్రమలోకి వెళ్లిపోతాం. వీధుల్లో నడుచుకుంటూ వెళ్లినా, పార్కుల్లో, షాపింగ్ ప్రాంతాల్లో ఇలా ఈ నగరంలో ఎక్కడికి వెళ్లినా ఒకే రూపంలో ఉన్న ఇద్దరు, ముగ్గురు మనుషులు మనకు ఒకేసారి కనిపిస్తున్నారు. ఈ ప్రాంతంలో రైతులు, చిరు వ్యాపారుల కుటుంబాలు ఎక్కువగా నివసిస్తుంటాయి. ఓ సర్వే ప్రకారం ప్రపంచ జనాభాలో దాదాపు 1.9 శాతం మంది కవలలు ఉన్నారు. కానీ ఇగ్బో-ఓరాలో దాదాపు ప్రతీ కుటుంబం కవలలతో నిండి ఉంటుంది. ఈ ప్రాంతంలో మహిళల ఆహారపు అలవాట్లు వల్ల ఇక్కడ కవలలు పుట్టడం చాలా ఎక్కువ అని పలు అధ్యయనాలు నిరూపించాయి. ప్రతీ ఏటా ఈ నగరంలో కవలల పండుగను నిర్వహిస్తారు. ఇందులో వెయ్యి కంటే ఎక్కువ మంది కవలల జంటలు పాల్గొంటారు.

ఫ్రాన్స్, చుట్టుపక్కల దేశాల నుండి కూడా ఈ పండుగలో పాల్గొనేందుకు ఇక్కడికి వస్తుంటారు. కవలల జననాల రేటు యూరప్, అమెరికాతో పోల్చినట్లయితే ఇక్కడ చాలా ఎక్కువ. ప్రతీ వెయ్యి జనాభాకు ఐరోపాలో 16 కవలలు, అమెరికాలో 33 కవలల జననాలు ఉంటాయి. కానీ ఇగ్బో-ఓరాలో ప్రతీ వెయ్యి జననాల్లో 200 జననాలు కవలే కావడం ప్రపంచంలోనే ఈ నగరానికి కవలల నగరంగా గుర్తింపు తెచ్చింది. మన దేశం విషయానికి వస్తే కేరళ రాష్ట్రంలోని మలప్పురం జిల్లా కోడిన్హిలో 2 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 400కు పైగా కవల సోదరులు, సోదరీమణులు ఉంటారు. దేశంలో సగటున వెయ్యి జననాల్లో 9 జననాలు కవలలు అయితే కోడిన్హిలో వెయ్యిజనాభాకు సగటున 45 జననాలు కవలలే ఉంటారు.

### కవలల ప్రపంచానికి వీరే మహారాణులు

ఎందరు వద్దని చెప్పినా, విజయం సాధించలేరని వ్యాఖ్యలు చేసినా వాటిని ఛాలెంజ్‌గా తీసుకున్న ఇరువురు కవలలు పట్టుదలతో పనిచేసి ఇప్పుడు కవలల సామ్రాజ్యానికి



మహారాణులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. వీరి గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.. వారిద్దరూ ఒకేలా కనిపించే కవలలు. వారిది వినూత్నమైన బిజినెస్ ఐడియా. తెలిసినవారు వారించినా సరే తెగించి ముందడుగు వేశారు. ప్రపంచంలోనే తొలిసారిగా కవలల రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అది ఇప్పుడు సూపర్ హిట్. దాన్ని విస్తరించాలనే ఆలోచన చేస్తున్నప్పుడే వారి అడుగులు సరికొత్త ఇండస్ట్రీని నెలకొల్పడానికి దారితీశాయి. ఏకంగా ట్విన్ ఎకానమికే ఈ కవలలు ఆద్యులయ్యారు. న్యూయార్కులో వున్న ఆ రెస్టారెంట్‌లో ఒకే రూపంతో ఇద్దరు కనిపిస్తారు. ఒక్కోసారి ముగ్గురు, మరోసారి నలుగురు కూడా అచ్చుగుద్దినట్లు ఒకే పోలికలతో ఉంటారు. ఇదేదో అద్దాల మేడ అనుకునేరు. కానేకాదు.

అక్కడ అద్దాల మండపంలో ప్రతిబింబాల మాదిరిగా కనిపిస్తుంటారు. మన కళ్లు మనల్నే మోసం చేస్తున్నాయేమోనని అనిపిస్తుంది. అదే ట్విన్స్ రెస్టారెంట్. న్యూయార్క్‌కు చెందిన డెబీ గంజ్, లీసా గంజ్ అనే కవలలు 1994 నవంబరు 14వ తేదీన మాన్‌హటన్‌లో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. తెలిసినవారి నుండి డబ్బులు సేకరించి ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు గంజ్ కవలలు. దీన్ని ప్రారంభించాలనే ఆలోచనను తమ స్నేహితుల వద్ద ప్రస్తావించగా వారంతా ఈ ఐడియా ఫెల్యూర్ అవుతుందని, డబ్బంతా వేస్ట్ అవుతుందని సలహాలు ఇచ్చినవారే. ఏదైనా మంచి జాబ్ చేయకుండా ఇలాంటి రెస్టారెంట్ ఎందుకు ప్రారంభిస్తున్నారని పెద్దలు



సైతం మందలించారు. చివరకు డెబ్బీ బాయ్ ఫ్రెండ్ కూడా ఈ కాన్సెప్ట్‌పై పలు అనుమానాలు వ్యక్తం చేశాడు. అయినా గంజ్ కవలలు మాత్రం ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా తమ ఆలోచనను అమల్లోకి తెచ్చారు అప్పట్లో 3.30 కోట్ల రూపాయలను వీరు సమీకరించి ట్విన్ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. 2022 లెక్కలతో పోలిస్తే ఈ మొత్తం ఇప్పుడు 6.60 కోట్ల రూపాయలకు చేరినట్లు అంచనా. రెస్టారెంట్‌ను ఏర్పాటు చేయడమే కాకుండా డెబీ, లీసాలు అందులో పనిచేసేవారందరినీ కవలలనే నియమించారు. అలా ఈ రెస్టారెంట్‌లో మొత్తం 30కి పైగా కవలల జంటలు పని చేయడం మొదలు పెట్టాయి. అయితే ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే ఇద్దరే కాకుండా నలుగురు, ముగ్గురు ఇలా ఒకే పోలికతో ఉన్న కవలలు కూడా పనిచేస్తున్నారు. వీరంతా ఒకే రకమైన దుస్తులు ధరించేవారు. నేను డెబీని కాదు అనే ఐడీతో కూడిన ట్యాగ్‌ను లీసా ధరిస్తే, నేను లీసాను కాదు అని ఉండే ఐడీని డెబీ ధరించేవారు. ఇలా ఈ రెస్టారెంట్‌లోని అన్ని జంటలూ ఇదే విధంగా ఐడీ కార్డులతో విధులు నిర్వర్తించేవారు. ఇక్కడ వీరికి ఒక కండిషన్ ఉందండోయ్.. అదేమిటంటే కవలల్లో ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే వారి సహచర సోదరి లేదా సోదరుడు సైతం ఇంట్లోనే ఉండాలి. ఇక్కడ పనిచేసే సమయంలో కూడా కవలలుగానే పనిచేయాల్సి ఉంటుంది. దీంతో ఈ రెస్టారెంట్‌లో యజమానుల వలనే అందులో పనిచేసే వారంతా కవలలే కావడం వారి విజయానికి కారణమైంది. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పాకి నగరమంతా తెలిసింది. దీంతో అతిథుల సంఖ్య భారీగా పెరిగింది. కొన్ని రోజుల వ్యవధిలోనే ఈ రెస్టారెంట్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. స్థానిక టీవీ షో నిర్వాహకులు సైతం ఇక్కడ షూటింగ్‌లు చేసుకునేందుకు పోటీ పడ్డారు. విజయవంతమైన వ్యాపారవేత్తలుగా మారిన వీరు ప్రఖ్యాత ఓప్రా విన్‌ఫ్రే టాక్ షోలోనూ కనిపించారు. ఈ నేపథ్యంలో వీరి దశ తిరిగింది. రెస్టారెంట్‌కు వచ్చిన విపరీతమైన క్రేజ్‌ను చూసి దేశ వ్యాప్తంగా తమ బ్రాంచ్‌లను ప్రారంభిచాలని వీరిద్దరూ భావించారు. కానీ ఈ రెస్టారెంట్లతో పాటు, అంతకు మించిన బిజినెస్ మోడల్‌ను సృష్టించారు. వాణిజ్య ప్రకటనల షూటింగ్ కోసం కవలలు అవసరమేతే గంజ్ ట్విన్స్‌నే అంతా సంప్రదించేవారు. డిస్నీ అధినేతల నుండి చిన్న చిత్రాల నిర్మాతల వరకూ ఎంతో మంది ఇక్కడకు వచ్చేవారు. సినిమాల క్యాస్టింగ్ కోసం కూడా ఇక్కడికి వచ్చి కవలలను ఎంపిక చేసుకునేవారు. రెమ్యూనరేషన్ ఎంత ఇవ్వాలని కొందరు ప్రొడ్యూసర్లు అడిగేసరికి ఇందులో ఓ బిజినెస్ ఐడియా ఉందని డెబీ గంజ్, లీసా గంజ్‌లు గ్రహించారు. దీంతో రెస్టారెంట్ బిజినెస్‌తో పాటు, షూటింగ్‌లు, ప్రకటనలు తదితర వాటికి ట్విన్స్‌ను సరఫరా చేయడమే తమ ప్రధాన కార్యక్రమంగా మార్చుకున్నారు. సినిమాలు, అడ్వెర్టైజ్‌మెంట్లు కోసమైనా, ఔషధ పరిశోధనలకైనా, అవసరం ఏదైనా కవలలు కావాలంటే డెబీ, లీసా వద్దకు వెళ్తే సరి పోతుందనే పేరు దేశ వ్యాప్తంగానే కాకుండా ఇతర దేశాలకు సైతం పాకింది. సెలెబ్రిటీ కవలల ఫొటోలతో ఒక పుస్తకాన్ని రూపొందించారు. దీ బుక్ ఆఫ్ ట్విన్స్ అనే పుస్తకాన్ని పబ్లిష్ చేశారు. ట్విన్స్ కాలెండర్లు, పుస్తకాలను విడుదల చేశారు. కవలల పెళ్లిళ్లకు క్యాటరింగ్‌లు చేయడం కూడా ప్రారంభిచారు. ప్రకటనలకు అయితే లెక్కే లేదు. ఇప్పుడు ఒహాయోలో 50 జంట కవలలతో ట్విన్ ఫెస్టివల్‌ను ప్రతీ ఏటా నిర్వహిస్తున్నారు. తాము కవలలకు బ్రాండ్ అంబాసిడర్‌లా మారిపోయామని, ట్విన్స్‌కు సంబంధించి ఏ అవసరం వచ్చినా తమను సంప్రదిస్తున్నారని డెబీ చెబుతున్నారు. లీసా, డెబీ కలిసి ఐడెంటికల్ ట్విన్స్ వివరాలతో ఓ డెటా బేస్‌ను సైతం రూపొందించారు. కంప్యూటర్లలోనే కాకుండా చేతితో రాసిన వీరి రికార్డులను భద్రపరిచామని డెబీ చెబుతున్నారు. ఇందుకు సంబంధించి వందలాది నోట్ బుక్స్ తమ వద్ద ఉన్నాయని చెప్పారు. యాడ్స్, సినిమాలు లేదా ఇతర ఎంటర్‌టైన్‌మెంట్ అవసరాల కోసం కవలలు కావాలని ఎవరైనా వస్తే 10 లేదా 20 శాతం కమిషన్ తీసుకుని వివరాలు ఇచ్చేవారు.

**(మిగతా 29వ పేజీలో)**





కథ

# చెద పట్టిన చెట్టు

ఎనిమిదో తరగతి చదివే అరుణ్ ఇంటికి వచ్చేసరికి తాతయ్యతో ఇద్దరు మనుషులు పెరట్లోని మామిడిచెట్టును గురించి మాట్లాడుతున్నారు. వారు మామిడిచెట్టు కొట్టేయటానికి డబ్బు బేరమాడుతున్నారు. ఆ మాటలు అరుణ్‌కి ఎంతో బాధ కలిగించాయి.

వారిద్దరూ వెళ్లిపోయాక తాతయ్య దగ్గరకు వెళ్లి "తాతయ్యా, మన మామిడిచెట్టును కొట్టేస్తున్నారా?" అని దిగులు నింపుకున్న మొహంతో అడిగాడు.

"అవున్రా.. మీ నాన్న ఆ చెట్టును కొట్టేయమన్నాడు. దానిని పరికించి చూడు, దాని కాండానికి చెదలు పట్టింది. ఆకులు కొంచెం వాడుతున్నట్లున్నాయి. దానిని అలా వదిలేస్తే దాని చెద ఇతర చెట్లకు కూడా పాకుతుందని మీ నాన్న భయం. అదీగాక ఆ చెట్టు కొట్టించి ఆ స్థలంలో ఓ చిన్న రూమ్ కట్టిస్తాడట" చెప్పాడు తాతయ్య.

"తాతయ్యా, అంత పాత చెట్టును ఎందుకు కొట్టేయాలి. ప్రతి సంవత్సరం మనకు మామిడిపండ్లు ఇస్తోంది. ఆవకాయ పెట్టుకునేందుకు కాయలు ఇస్తోంది. మన ఇంట్లో ఏ పండుగ జరిగినా దాని మామిడాకులు గుమ్మాలకి కట్టుకుంటాం కదా" అని ఎంతో బాధతో చెప్పాడు అరుణ్.

"అవున్రా.. మీ నాన్న ఒప్పుకోవడం లేదు"

"తాతయ్యా మనుషులకి జబ్బు చేస్తే మందులు వేసుకుని బాగు చేసుకుంటున్నాం కదా! మరి చెట్టుకి జబ్బు చేసినా, చీడ పట్టినా మందులేసి బాగు చేయవచ్చు కదా!"

"బాగా చెప్పావురా. దాని గురించి కూడా ఆలోచించాను. మన మూడో ఇంట్లో ఉన్న శ్రీధర్ అంకుల్ వ్యవసాయ శాస్త్రవేత్త. ఆయనకి మన చెట్టు చూపిస్తే ఆయన మంచి మందు సూచించి దానిని బాగు చేయవచ్చు.. నా ఆశ కూడా అదే"

"తాతయ్యా, రేపు పొద్దున నేనే శ్రీధర్ అంకుల్ వద్దకు వెళ్లి ఆయనను తీసుకువచ్చి చెట్టును చూపించి, మంచి మందు వేసి చుట్టును బతికించమని చెబుతాను"

"నేను కూడా వస్తాను. ఇద్దరం కలిసి చెట్టును గురించి చెబుదాం" చెప్పాడు తాతయ్య.

"చెట్టు కొట్టకుండా నాన్నను ఒప్పిస్తాను" చెప్పాడు అరుణ్.

"ప్రయత్నించు.. ప్రయత్నించడంలో తప్పులేదు" చెప్పాడు తాతయ్య.

సాయంత్రం అరుణ్ నాన్న ప్రసాదరావు రాగానే ఆయనను మామిడిచెట్టు గురించి అడిగాడు.

"నాన్నా, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ కొట్టేయించకు. చిన్నప్పటినుండి దానికిందే ఆడుకున్నాను. దాని పండ్లు ప్రతి సంవత్సరం తింటున్నాం, ప్లీజ్ నాన్నా, నా మాట వినవా? మన మూడో ఇంట్లో శ్రీధర్ అంకుల్‌కి చెట్లను గురించి బాగా తెలుసుకదా, ఆయనను తీసుకువచ్చి మన చెట్టును చూపించి మంచి మందు అడుగుతాం" అని కళ్లలో ఆశను నింపుకుని అడిగాడు.

అరుణ్ అడిగిన తీరును చూసేసరికి ప్రసాదరావు మనసు కరిగింది.

"సరే.. శ్రీధర్ అంకుల్‌కి చెట్టును చూపించి మంచి మందు అడుగుదాం. దానిని ఎలాగయినా బతికించుకుందాం" అన్నాడు.

అరుణ్ మొహం సంతోషంతో వెలిగింది. మరుసటి రోజు అరుణ్, ప్రసాదరావు, తాతయ్య శ్రీధర్ వద్దకు వెళ్లి చెట్టు సంగతి చెప్పి వచ్చి చూడమని చెప్పారు. శ్రీధర్ ప్రసాదరావు ఇంటికి వచ్చి చెట్టును పరిశీలించి "ఇది పెద్ద సమస్య కాదు, దీనికి పాదు దగ్గర చెక్కను కాల్చిన బూడిద, చెట్టుకాండానికి వేపనూనె పిచికారి చేస్తే ఈ చెదపీడ వదలిపోతుంది. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది కదా! చెట్టును బతికిస్తే మీ ఇంటికి అందం, మంచి పండ్లు దక్కుతాయి, అరుణ్ కూడా సంతోషిస్తాడు" అని చెప్పి అరుణ్ అమ్మ ఇచ్చిన కాఫీ తాగి ఓ కాగితం మీద మంచి బాండు వేపనూనె పేరు రాసి ఇచ్చాడు.

ఇప్పుడు అరుణ్, తాతయ్య, ప్రసాదరావులకి మామిడిచెట్టు ఎంతో అందంగా కనబడసాగింది.

**- కంచనపల్లి వేంకట కృష్ణారావు**







వార్త ఆదివారం

## బాలగేయం

### పలికించే వర్ణమాల

పిల్లల్లారా రారండోయ్
పెద్ద బాలశిక్ష
చదవండోయ్
ఒయ్యారం ఒలికించే
గుణింతములు
పిల్లల్లారా రారండోయ్
పెద్ద బాలశిక్ష
చదవండోయ్
అమ్మ చెప్పని
సామెతలెన్నో
నాన్న చెప్పని
పొడుపుకథలెన్నెన్నో
పెద్ద బాలశిక్ష
చదవండోయ్
పరిమళించే వాక్యాల
మాలలు అల్లండోయ్
అమ్మకు నాన్నకు
వేయండోయ్
ప్రేమతో దీవెనలు
పొందండోయ్.
నవ్వే గులాబీలు అక్షరాల
అందాలు
హల్లుల వత్తులు
పిల్లల్లారా రారండోయ్
పెద్ద బాలశిక్ష
చదవండోయ్

**- సత్యనారాయణ పూసల**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- బి.ప్రశాంత్,** బొబ్బిలి

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వజ్రం ఎలా ఏర్పడుతుంది?**

**జవాబు: ప్రశాంత్!** వజ్రం స్ఫటిక రూపంలో ఉండే బొగ్గు వంటిది. భూ అంతర్భాగాలలో లభిస్తుంది. వజ్రం ఉష్ణవాహకమే అయినా దీనిగుండా విద్యుత్ ప్రవహించదు. సహజ వజ్రాలనేవి గనుల నుంచే వెలికి తీస్తారు. ఇది 900 డిగ్రీ సెంటీగ్రేడ్‌లో కాలడం ప్రారంభమై నెమ్మదిగా వాతావరణంలోని ప్రాణవాయువుతో కలిసి బొగ్గుపులుసు వాయువు(కార్బన్ డై ఆక్సైడ్)గా మారుతుంది. భూ అంతర్భాగాలలోని అత్యధిక ఉష్ణోగ్రతలో బొగ్గు వజ్రంగా రూపాంతరం చెందుతుంది. ప్రపంచ స్థాయిలో ఆఫ్రికా ఖండంలో సహజ వజ్రాలు అధికంగా లభిస్తాయి.

**- బి.వసుధ,** కాకినాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. లాయర్ కోటు, గొడుగులను నల్లటి వస్త్రంతోనే తయారు చేస్తారు, కారణం ఏంటి?**

**జవాబు: వసుధ!** : లేత రంగుల కన్నా నలుపు రంగు లేదా ఇతర ముదురు రంగులు పరిసరాల నుంచి ఎక్కువ ఉష్ణోగ్రతను గ్రహిస్తాయి. దాంతో బాష్పీభవన ప్రక్రియ వేగంగా జరిగి, త్వరగా ఆరిపోతాయి. నల్లటి బట్టల అణు నిర్మాణంలో అన్ని రంగుల కాంతులను గ్రహించి ఉత్తేజితం అయ్యే స్వభావం ఉంటుంది. నల్లటి వస్త్రాల మీద పడిన కాంతి మొత్తం శోషణం చెందుతుంది. తీవ్ర స్థాయిలో వున్న ఉష్ణాన్ని ఈ నలుపు రంగు మింగేస్తుందని చెప్పుకోవచ్చు. మరోరకంగా పడిన ఎండ వేడిమిని చెల్లాచెదరు చేసేస్తుందని చెప్పవచ్చు. అంతేకాదు, నలుపు రంగు వస్త్రంతో గొడుగులు తయారు చేయడం వల్ల అవి త్వరగా పొడిగా అవుతాయి. ఇటీవల గొడుగులకు సింథటిక్ వస్త్రాలను వాడుతున్నారు. ఇవి నీటిని పీల్చుకోవు. అన్ని కాంతి తరంగాలను(రంగులను) గ్రహించగలిగేది నలుపురంగు మాత్రమే.





# అరుదైన శివలింగం
# గుడిమల్లం పరశురామేశ్వరుడు



శైవాలయాలకు నిలయంగా తిరుపతి జిల్లా తూర్పు ప్రాంతాలు వెలిసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాయి. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చారిత్రాత్మక ప్రసిద్ది చెందిన, అరుదైన లింగాలు వెలిసిన దివ్య క్షేత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం పురావస్తు శాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న గుడిమల్లం పరశురామేశ్వరాలయం ఒకటి. అలాగే నాడు రాముడు సీతాదేవిని వెతుక్కుంటూ ఈ ప్రాంతానికి వచ్చారని ఈ సందర్భంగా బొక్కసంపాళెంలో శివాలయం నిర్మించి పూజించారని ఈ ఆలయం ఇటీవల వరకు పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉండగా శివాలయం ఉనికిని మొట్టమొదట బ్రిటీష్ ప్రభుత్వం 1910లో గుర్తించింది. ఆలయ నిర్మాణ శైలిని బట్టి దీన్ని శాతవాహనులు నిర్మించినట్లు తెలుస్తోంది. ఆలయ తవ్వకాల్లో లభించిన ఒక శాసనం ప్రకారం పన్నెండో శతాబ్దం విక్రమ చోళుడి కాలంలో ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు.



నేడు శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్నారు. ఆలయాలకు కొదవ లేదు. కానీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. ఇక చారిత్రక, పురావస్తు శాఖ పర్యవేక్షణలో ఉన్న ఆలయాలకు పర్యటక శాఖ పట్టించుకోవటం లేదు. దాంతో ఈ చారిత్రక ఆలయాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారాయి. పురుషాంగాన్ని పోలిన లింగం ఆ దేవాలయం మన వాస్తు శాస్త్ర నియమాలకు విరుద్ధంగా పశ్చిమాభిముఖంగా వెలసి ఉంది. ఇలాంటి లింగం భారతదేశంలో ఎక్కడా లేదు. పురుషాంగాన్ని పోలిన శివలింగం మరో విశేషం. క్రీ.పూ. రెండో శతాబ్దం ప్రాంతంలో నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలుగా చెబుతున్న ఈ ఆలయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లాలోని గుడిమల్లం. ఈ శివాలయం అనేక విశేషాలకు నిలయం. తిరుపతికి సుమారు ముప్పై కిలో మీటర్ల దూరంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం పాపానాయుడు పేటకు నాలుగు కిలోమీటర్ల దూరంలో, శ్రీకాళహస్తికి ఇరవై తొమ్మిది కిలోమీటర్ల దూరంలో గుడిమల్లం గ్రామం ఉంది. ఇక్కడి దేవాలయాన్ని పరశురామేశ్వరాలయంగా పిలుస్తారు. ఇది ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది.

## క్రీస్తు పూర్వం నాటి పురాతన ఆలయం

పురావస్తు శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ గుడిలోని శివలింగం క్రీ.పూ. ఒకటి లేదా రెండో శతాబ్దం నాటిదని అభిప్రాయపడుతున్నారు. అయితే దీన్ని ఎవరు ప్రతిష్టించారో మాత్రం కచ్చితంగా చెప్పలేకపోతున్నారు. గుడిమల్లంలోని

## ప్రపంచంలో ఎక్కడా లేని శివలింగం

సాధారణంగా శివుణ్ణి ఆలయాల్లో లింగాకారంలోనో అర్ధనారీశ్వరుడిగానో, నటరాజుగానో చూస్తాం. కానీ, గుడిమల్లంలోని శివలింగం మాత్రం విచిత్రంగా ఉంటుంది. ఒకటిన్నర మీటర్ల పొడవున్న ఈ లింగాన్ని అష్టధాతువులతో తయారు చేసినట్లు తెలుస్తోంది.

## శివలింగం ప్రత్యేకత..

ఇక్కడ వెలసిన లింగంలో.. రాక్షసుడి భుజాలపై నిల్చున్నట్లున్న శివుడు, కుడిచేతిలో జింక (సారంగపాణి), ఎడమచేతిలో భిక్షపాత్ర, భుజంపై గండ్రగొడ్డలి, చెవులకు కుండలాలు, ముంజేతికి కడియాలు, మొలకు ధోవతి, తలకు లేత తాటికాయల కిరీటం కనిపిస్తాయి. కానీ యజ్ఞోపవీతం లేదు. ఇది మంగోలులను పోలిన రూపం కావడం విశేషమని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈ లింగాన్ని ముఖలింగం అని కూడా వ్యవహరిస్తారు. శివుడి చేతిలో ఉన్న గొడ్డలిని బట్టి ఈ ఆలయానికి పరశురామేశ్వరాలయం అని పేరు వచ్చింది. ఉజ్జయిని తవ్వకాల్లో క్రీ.పూ మూడో శతాబ్దానికి చెందిన రాగినాణేలు లభించాయి. వాటిపై గుడిమల్లంలోని శివలింగాన్ని పోలిన చిత్రాన్ని కనుగొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర మ్యూజియంలో భద్రపరచిన క్రీ.పూ. ఒకటో శతాబ్దానికి చెందిన లింగం గుడిమల్లంలోని శివలింగాన్ని పోలి ఉండడం విశేషం. పురావస్తుశాఖ 1973లో ఈ దేవాలయంలో తవ్వకాలు సాగించారు. అప్పుడు గర్భాలయంలో శివలింగం పురాతన

అవశేషాలున్న దిబ్బపై దొరికినట్లు తెలిసింది. ఇక్కడి పరిసరాల్లో క్రీ.పూ 2 లేదా 3 శతాబ్దాలకు చెందిన మృణ్మయ పాత్రలు నలుపు, ఎరుపు రంగుల్లో లభించాయని చెబుతున్నారు. శాతవాహనుల కాలంనాటి మెరిసే పాత్రల అవశేషాలు, పెద్ద సైజు ఇటుకలు అనేకం లభించాయని ఇక్కడ ప్రతిష్ఠించిన శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది.

## గుడిమల్లం కాదు.. 'గుడిపల్లం'

సాధారణంగా అన్ని ఆలయాలు తూర్పు ముఖంగా ఉంటాయి. కానీ గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరాలయాన్ని పశ్చిమాభిముఖంగా నిర్మించారు. అంతేకాదు, కొంత కాలం క్రితం ఆలయానికి ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న దేవాలయ నిర్మాణం రెండు దశలుగా సాగినట్లు శిలాశాసనాలు చెబుతున్నాయి. గర్భాలయం పైకప్పు గజ పృష్ఠాకారంలో అంటే ఏనుగు వెనుక భాగాన్ని పోలి ఉంటుంది. పల్లవుల కాలానికి చెందిన గుడి కనుక దీన్ని గుడిపల్లం అని పిలిచేవారట. గర్భగుడి పల్లంలో ఉండడం చేత గుడిపల్లం అనేవారని, కాలక్రమంలో ఇది "గుడిమల్లం"గా మారిందని చెబుతారు. చివరికి ఊరిపేరును కూడా ఈ ఆలయం పేరు మీదే గుడిమల్లంగా పిలుస్తున్నారు. ఆలయంలో లభించిన శాసనాల్లో మాత్రం ఈ పేరుకు సంబంధించిన ప్రస్తావన ఎక్కడా లేదు. చోళరాజుల శాసనం ప్రకారం ఈ గ్రామాన్ని "తిరువిప్పరమ్‌బేడు" అనే తమిళ పేరుతో పిలిచేవారు. అంటే తెలుగులో "శ్రీవిప్రపీఠం" అని అర్థం. దీనిని బట్టి ఆ కాలంలో ఈ గ్రామం బ్రాహ్మణ అగ్రహారం కావచ్చని తెలుస్తోంది. దేవాలయం నిర్మాణం రెండో దశ పనులు బహూశా చోళుల హయాంలో జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గర్భగుడికి ప్రదక్షిణ సౌకర్యం కల్పిస్తూ మండపాలు, అంతరాళం, కుడ్యాలంకారాలతో నిర్మించారు. పడమటి వైపు ప్రవేశ గోపుర ద్వారం, ప్రాంగణంలో పరివార దేవతలకు చిన్న చిన్న గుళ్ల నిర్మించారు. ఇందులో సూర్యుడు, కార్తికేయుడు, దేవీ విగ్రహాలు ఉన్నాయి. అన్నింటినీ కలుపుతూ ప్రాకార నిర్మాణం జరిగింది. స్వామివారి అభిషేకానికి యాదవ రాజుల కాలంలో క్రీ.శ.1346లో బావిని తవ్వించినట్లు తెలుస్తోంది. క్రీ.శ 8వ శతాబ్దం నుంచి ఈ ఆలయంలో పూజలు జరిగినట్లు పురావస్తు శాస్త్రవేత్తల అంచనా. ప్రస్తుతం ఆలయంలో స్వామివారికి నిత్య ధూప, దీప నైవేద్యాలు అభిషేకాలు జరుగుతున్నాయి. తిరుపతి నుంచి గుడిమల్లం చేరుకునేందుకు ఆర్టీసి బస్సులు ఉన్నాయి. దేశంలోనే అత్యంత ప్రాచీన ఆలయాల్లో ఒకటిగా పేర్కొన బడుతోంది. ఇప్పుడిప్పుడే ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ఏది ఏమైనా అతి పురాతన ఆలయాల్లో ఇది ఒకటని చెప్పుకోవచ్చు.



**గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుడు**



**ఆలయంలో వెలసిన పురాతన శిలాశాసనాలు**

## గుడికి మాన్యాలు

పురాతనమైన పరశురామేశ్వరాలయ నిర్వహణకు నాడు ఈ ప్రాంతాలను పరిపాలించిన రాజులు వందలాది ఎకరాల మాన్యాలను ఏర్పాటు చేసారు. కాలక్రమేణ వాటిని కొందరు అమ్ముకున్నారు. కోర్టు వివాదాల్లో నలుగుతున్నాయి. ఈ ఆలయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయానికి దత్తత తీసుకొని అభివృద్ధి పరచాలన్న ఆలయ ధర్మకర్తల మండలి విన్నపం దశాబ్దాలు గడుస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు.

**- ఎస్.రహంతుల్లా,**
స్టాఫ్ రిపోర్టర్, శ్రీకాళహస్తి

**- ఫొటోలు: సి.మెహర్‌కుమార్,**
రిపోర్టర్

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్,**
**ఆదివారం వార్త,** నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

అనువాదకథ

**హిందీ మూలం: శ్రీమతి లక్ష్మీశర్మ**

**అనువాదం: ఐతా చంద్రయ్య**

# అంతస్తులు

పెళ్లైన తర్వాత పిల్లలు సహజమే.. కానీ వరుసగా నలుగురు ఆడపిల్లలు జన్మించారు. మలిక, సల్మా, రింసా, రేష్మా. తండ్రి జమాల్ మనసు తల్లడిల్లింది. భార్య సయదా ఎన్నిసార్లు మొత్తుకున్నా వింటేనా?

"నలుగురాడపిల్లలకు జన్మనిచ్చావు గదా, నువ్వే పెంచి పోషించు. మిమ్ములనందరినీ నేనెలా పోషించాలి?" భార్యనడిగాడు.

"దానిక్కారణం నువ్వే. ఆపరేషన్ చేయించుకుంటే ఇద్దరితో ఆగిపోయేది, ఇంత కష్టం ఉండేది కాదు" సయదా జవాబిచ్చింది నిర్మోహమాటంగా.

"మనవాళ్లెవ్వరూ ఆపరేషన్ చేయించుకోరు"

"నీ ఇష్టం దొరగారూ, ఎందరినైనా కను. నన్ను అనొద్దు"

"సర్స రే. కూడు బెట్టు. బయటికెళ్లి ఏదన్నా పని చూసుకుంటా".

"రొట్టెమీదికి కూరల్లేవు. ఉల్లిగడ్డ చట్నీ వుంది".

"నా ఖర్మ! పెళ్లి కాకముందు హాయిగా ఉండేవాన్ని. ఇప్పుడు తిండిగ్గూడా తిప్పలు పడాల్సి వస్తుంది". "ఏదన్నా పని చూస్కో. లేకపోతే ఉపవాసాలుండాల్సి వస్తుంది".

"అమ్మా! నాకు డబ్బులు కావాలి" మలిక వచ్చి అడిగింది.

"మీ నాన్ననే ఇబ్బంది పడుతున్నాడు".

"నాన్న పని చేస్తే పైసలెందుకు దొరకవు?"

"మీ నాన్ననా! పేలవంగా నవ్వింది. పక్కా పనిదొంగ గదా! అలాంటి వ్యక్తినెవరు పనిలో పెట్టుకుంటారు?"

"మరెట్లా? నాకు చాలా అవసరమమ్మా!"

"కుట్టుమిషన్ కొందామంటే కుదరలేదు. చేతుల్తో టోపీలు కుడుతుంటే ఏమొస్తుంది?"

"ఇన్ని టోపీలు ఎవరికోసమమ్మా!" సల్మా ఆశ్చర్యం.

"పండగొస్తుందిగదా! బజార్లో అమ్మితే పైసలొస్తాయి.

"పండగొస్తుందా? రింసా ఆనందం. మాకు కొత్త సల్వార్, కుర్తాలు కుట్టిస్తారన్నమాట" మురిపాల మూట విప్పింది. "అవునవును.. మీ నాన్ననే కుట్టిస్తాడు" సయదా వెటకారం.

"అమ్మా! నీకెందుకంత నిరాశ?"

"మరేం చెయ్యాలి? తినేందుకు తిండిలేదుగానీ కొత్త బట్టలా?"

రోజూ ఇదే గొడవ. సయదా తన దుదృష్టాన్ని తిట్టుకుంటుంది. మలిక మగపిల్లగాడైతే నాల్గు పైసలు సంపాదించేవాడు... గొణికింది.

జమాల్ వచ్చి చేతులున్న సామానుల సంచి రేష్మాకందించాడు.

"మలికా! మీ అమ్మ ఇంట్లో ఏవీ లేవంది. అందుకే రొట్టేసింది, పప్పు తెచ్చిన"

మలిక "నాన్నా, నాక్కొంత డబ్బు కావాలి" భయంగా అంది.



"డబ్బులేమన్నా చెట్లకు కాస్తున్నాయా?"

"అయ్యో దేవుడా?" సయదా కల్పించుకుంది.

"నేను బాగా చదువుకుంటే ఉద్యోగం చేసేదాన్ని. ఎవరింట్లోనన్నా పాచిపని చేద్దామనుకుంటున్నా. అంట్లు తోమితే ఏమవుద్ది?"

"ఏమిటీ? అంట్లు తోమడమా?" జమాల్ లోయలో పడ్డట్టనిపించింది. "మన వంశ ప్రతిష్ఠను మట్టిలో కల్పేస్తావా? ఆకలితో అలమటిస్తున్నావు గదూ! చౌరస్తాలో డాన్సు చెయ్"

"మరేం చెయ్యాలి? వంశ ప్రతిష్ఠ అంటే అవసరాలు తీరవు గదా!"

"సయదా! మా నాన్నకు తెలిసిన పెద్దవారెవ్వరూ నాతో పని చేయించుకోరు. అయినా ప్రయత్నిస్తున్నా. పని దొరికితే రెండు బుక్కల తిండి దొరికేది. మలిక మగపిల్లవాడైతే నాకు సాయంగా ఉండేది. ఆడపిల్లలేం చేస్తరు? పెంచి పెళ్లిళ్లు చేసి పంపించాలాయె".

"మలిక ఏదన్నా ఉద్యోగం చేస్తానంటోంది"

"మలిక..! ఉద్యోగమా? మన వంశంలో ఆడవాళ్లు ఉద్యోగాలకు బయటికెళ్లరు. వంశ గౌరవాన్ని వేలం వెయ్యకు".

"బట్ట, పొట్టకోసం ఉద్యోగం చేస్తే తప్పేముంది? మన అంతస్తు కూలిపోతుందా? వంశ గౌరవమంటే ఆకలి తీరుతుందా? పిల్లలు మీకు భయపడ్తారు, నా ప్రాణం తినేస్తారు. మనను అడగకుంటే బిచ్చమెత్తుతారా?"

"నా బతుకే దండగ.. అల్లా! దయ చూపించు" జమాల్ అంగలేస్తూ బయటికెళ్లాడు.

ఆయన తండ్రికి దుకాణముండేది. వ్యవసాయం కూడా ఉండేది. వ్యాపారంలో నష్టం రావడంతో అంతా ఊడ్చుకుపోయింది. మిగిలిన ఇల్లు సగం తండ్రి వైద్య ఖర్చులకు సరిపోయింది. మిగతా సగమంతా తాను, తమ్ముడు కమాల్ చెరిసగం పంచుకున్నారు. విడిపోయి చాలా కాలమైంది. ఇద్దరి మధ్య సంబంధాలు ఎంతకంతే.

కమాల్‌కు సంతానం లేదు. ఫరీదా అక్కకొడుకును పెంచుకుంటోంది. కుటుంబ పోషణకు కమాల్, కొడుకు ఇద్దరూ సంపాదిస్తున్నారు.

జమాల్ ఆప్తమిత్రుడు అన్వర్. అప్పుడప్పుడు బజార్లో కలుస్తాడు. పండగొచ్చింది. పిల్లలు నెత్తీనోరు కొట్టుకున్నరు. దురదృష్టాన్ని తిట్టుకున్నారు. పండగనాడు అందరూ పలావు, మిఠాయిలు తినాలిగదా! సయదాకు మలిక తోడై బట్టలు కుడుతోంది.

జమాల్‌కు అన్వర్ కలిశాడు..

"జమాల్! కనబడ్డం లేదేమిటి?"

"ఈ రోజుల్లో బయట ఉండే వ్యాపారం చేస్తున్న. నీ సంగతేమిటి?"

"నా సంగతి ఎందుకులే అన్వర్‌భాయ్" గొంతులో నిర్వేదం. "నలుగురాడపిల్లల్తో నరకం చూస్తున్నా. పండక్కి ఎవరికేమీ కొనియ్యలేక పోయాను. కొత్తబట్టలు కొందామంటే జేబు ఖాళీగుంది..సయదా సూటిపోటి మాటలంటోంది"

"జమాల్‌భాయ్! అల్లా దయవల్ల నీ కూతుళ్లు అందంలో పందెమసొంటోల్లు"

"ఎత్తిపొడుపు చాల్లే భాయ్! భార్య విషం తింటానంటోంది. మలిక చదువు ఆగిపోయింది, ఉద్యోగం చేస్తానంటోంది నా వంశగౌరవం ఏం కావాలి చెప్పు?"

"అంత కష్టమన్నప్పుడు మలికకు పెళ్లెందుకు చెయ్యవూ?"

"తాను దూర సందులేదు, మెడలో డోలు.. అన్నట్టు తినేందుకే లేదంటే ఆడపిల్ల పెళ్లి చెయ్యంటావేంది?"

"నీకేమీ ఖర్చు కాదు. నువ్వు ఊ.. అంటే కన్యాశుల్కం ఇచ్చే సంబంధం తెస్తా. ఖర్చులు వాళ్లే భరించి, నీకు కొంత డబ్బు యిస్తారు"

"ఆహా.. అయితే అది ఉభయతారకం. నేనెందుకు వద్దంటాను?"

"సరే.. మలిక పెళ్లవుతుంది. నీ చేతికొచ్చిన డబ్బుతో రెండో కూతురు పెళ్లి చెయ్యొచ్చు. సంబంధం నేనే చేస్తా"

"మంచి సలహా. నేనిప్పుడే ఇంటికెళ్లి సయదాకు చెప్తా".

"అరె.. ఎందుకంత తొందర? ఈ సంగతి అందరికీ తెలిస్తే వాళ్లు మరో అమ్మాయిని చేసుకుంటారు, జాగ్రత్త".

"సరే.. ఎవరికీ చెప్పను, నువు పట్నం వెళ్లి సంబంధం మాట్లాడు".

"సరే పద. ఖాదిర్‌భాయ్ హోటల్లో ఏమన్నా తిందాం"

ఇద్దరూ కలిసి వెళ్లారు.

ఖాదిర్ ఎదురొచ్చి "ఆహా! చాలా కాలం తర్వాత దయచేశారు. వెంట జమాల్ గూడా" స్వాగతించాడు.

"ఔను.. రెండు ప్లేట్ల గరంబిర్యానీ పంపించు. అన్వర్ ఆర్డర్. వేడి బిర్యానీ తింటుంటే జమాల్‌కు ఆకాశంలోకి ఎగిరినట్టుంది. "ఆహా.. చాలా రోజుల తర్వాత మటన్ బిర్యానీ. రెండు రోజులకు సరిపోయేంత తింటాను" మురిసాడు జమాల్.

"నేను చూపించిన సంబంధాలు చేస్తే నీ జీవితం హాయిగా గడుస్తుంది".

"ఇది కల కాదు గదా! నువు నా పాలిట దేవదూతవు అన్వర్!"

...

ఇంటి పరిస్థితులు చూసి మలిక బాధపడుతోంది. ఖర్చుల కోసం బట్టలు కుడుతుంది. టైలర్ షాపు నుండి బట్టలు ఇంటికి తీసుకెళ్లి కుట్టి తెస్తుంది. దర్జీమాస్టర్ దయగలవాడే.

"మాస్టార్జీ! నాకు ఎక్కువ బట్టలివ్వండి. మంచిగా కుట్టుకొస్తా" అడిగింది మలిక.

మాస్టారుకు జాలేసింది.

"ఇక్కడే ఉండి కుట్టొచ్చు గదా!"

"అబ్బో.. మా నాన్న కూలిపని చెయ్యవద్దంటాడు"

"నా దుకాణంలో ఆడవాళ్ల సెక్షన్ వేరే ఉందిగదా"

"నాన్న ఇంటి నుండి బయటికెళ్లొద్దంటాడు. కొంచెం సాయం.."

"అంటే.. ఎలాంటి సాయం?"

"నాకో కుట్టుమిషన్ ఇప్పించండి"

"మిషను ఖరీదునగదు చెల్లించాలి గదా!"

"నగదా! డబ్బుల్లేక సగం కడుపుకు తింటున్నాం. నెలా నెలా బట్టలు కుట్టిన కూలిడబ్బుల్లోని తీర్చేస్తా"

"అట్లా ఎవ్వరికీ ఇప్పించను. కానీ మీ పరిస్థితి తెలిసింది కాబట్టి రిస్క్ తీసుకుంటాను. బజార్లో మీ నాన్నకేమాత్రం గౌరవం లేదు. నీ నిజాయితీనే నమ్ముతున్నాను.

"తప్పకుండా నేనే తీర్చేస్తాను"

"కొత్తదైతే నాతో కాదుగానీ సెకండ్ హాండ్‌ది ఇప్పిస్తా.. జాగ్రత్త"

"మీ దగ్గరే బట్టలు కుట్టేందుకు బట్టలు తీసుకెళ్తున్నాను, తీర్చేస్తాను"

"సరే! నువ్విలాగే కుట్టుకొస్తుండు, నేను కుట్టుమిషన్ ఏర్పాటు చేస్తా"

...

"ఆహా.. చాలా రోజుల తర్వాత మటన్ బిర్యానీ. రెండు రోజులకు సరిపోయేంత తింటాను" మురిసాడు జమాల్. "నేను చూపించిన సంబంధాలు చేస్తే నీ జీవితం హాయిగా గడుస్తుంది" అన్వర్.

సయదా, మలిక బట్టలు కుట్టడం, పాల్స్, గుండీలు కుట్టడం లాంటి పనులు చకచకా చేసేస్తున్నారు. ఇంటిపని, వంటపని సల్మా, రింసా చూస్తున్నారు. జమాల్ ట్రిమ్ముగా తయారై బయటికెళ్తున్నాడు.

"దొరగారు రాజాలాగ శుభకార్యానికెళ్తున్నారా" సయదా అడిగింది.

"అవును.. మలికకు పెళ్లి సంబంధం చూసాను. వాళ్లిప్పుడు పెళ్లిచూపులకొస్తారు. మలికను తయారు చేసి రెడీగా ఉంచండి"

"నాకేమీ చెప్పకుండానే" సయదా భృకుటి ముడిపడింది.

"ఎవరితో మాట్లాడారు? వాళ్లకు అల్పాహారం గూడా ఇవ్వలేదు"

"నా జిగ్రీ దోస్త్ అన్వర్‌కు మన పరిస్థితి అంతా చెప్పిన. తానే మలికకు మంచి సంబంధం తెస్తానన్నాడు. పెళ్లి ఖర్చంతా మగపెళ్లివారిదే. మనగ్గూడా కొంత డబ్బిస్తారు".

"మన ఖర్చులకు డబ్బిచ్చేందుకు పెళ్లికొడుకేమన్నా దేవుడా?" "సయదా! అన్వర్ నా ఖాస్ దోస్త్. జాలిపడి సాయం చేస్తున్నాడు. దాన్ని నువు అనుమానిస్తే ఎలా? అనుమానం పాత రోగమన్నారు".

"మీ తమ్ముణ్ని సాయమడిగితే తప్పా?"

"వాడు సాయం చెయ్యడు" చెప్పుల టకటకలతో బయటికెళ్లాడు.

సయదా మెదడును అనుమానం పురుగు తొలిచేస్తుంది. ఏ ముసలి షేక్‌కో అంటగట్టే ప్రయత్నమా? షేక్‌లైతే అరవిరిసిన కన్నెపిల్లల్ని పెళ్లాడి, అందాలను ఆస్వాదించి అవతల పడేస్తారు. అప్పుడు పిల్ల గతేమిటో? అలాంటిదైతే నిర్మొహమాటంగా తిప్పికొట్టాలి. మౌనంగా శూన్యంలోకి చూస్తూ కూచుంది.

"ఏమాలోస్తున్నావమ్మా!" భుజమ్మీద చెయ్యేసింది మలిక.

"మీ నాన్న నీకు పెళ్లి చేస్తాడట. వాళ్లిప్పుడు పెళ్లిచూపులకొస్తారట. కన్యాశుల్కం.. అంటే మనకే కట్నమిస్తారట. అన్వర్ తెస్తున్న సంబంధం. రింషా సంతోషంతో "అక్క పెళ్లా?" మురిసిపోయింది.

మలికకు అదేమీ నచ్చలేదు. "అమ్మా! విషయం పెళ్లిదాకా వెళ్లిందా? నా ఇష్టంతో పని లేదా? ఏ ముసలి గుడ్లగూబనో అంటగడ్తానంటే నాకు నచ్చదు.

"నాన్న.. అన్వర్‌చాచా మాయమాటలు చెప్పి నా నోరు మూయిస్తరు"

"అక్కా! అబ్బాయి బాలేకపోతే నచ్చలేదని చెప్పు. భయపడితే బతుకు బజారుపాలవుతుంది" సల్మా ధైర్యం నూరిపోసింది.

"వాళ్లు రానీ! అదేమన్నా మంచి సంబంధమేమో!" తల్లి ఆరాటం.

అన్వర్ మిఠాయి పాకెట్ తెచ్చాడు. దాన్ని జమాల్ లోపల పెట్టాడు.

రేష్మా అందరికీ మంచినీళ్లు అందించింది. తండ్రి, అన్వర్, అతిథి ముగ్గురున్నారు. అతిథికి సగమీదు తిరిగినట్టుంది, వ్యాపారం చేస్తున్నాడట.

మలిక తయారై వచ్చి కూచుంది. కుందనబొమ్మ లాగుంది. అతిథిని చూసి "సగమీదు దాటినోడు నన్ను పెళ్లాడ్తాడట. అన్వర్ చాచాగీ సంబంధం తెస్తాడా?".



సయదా కడుపు మండిపోతోంది. జమాల్, అన్వర్ మాటల్లో పడ్డారు. సయదా, మలిక వెంట జమాల్ లోపలికెళ్లాడు.

"నేనీ పెళ్లి చేసుకోను. మలిక రోషంతో బుసబుసలు.. "నా తండ్రి వయసున్నోడు యువకుడా?" ముక్కుపుటాలెగిరి పడినై. జమాల్‌కు కోపమొచ్చింది.. "ఈ పెళ్లి జరుగుతుంది. అతడు వ్యాపారి. పైగా మనకే డబ్బిస్తారు" అన్నాడు.

మలిక వెక్కి వెక్కి ఏడుస్తోంది. "నేనా ముసలోణ్ణి చేసుకోను" "మగవాళ్ల వయసు చూడరు. మలికా" జమాల్ సముదాయింపు. అతడు పెద్ద వ్యాపారి. ఆస్తిపాస్తులున్నై. అన్వర్ వెతికితెచ్చిండు". "తెచ్చాడులే ఓ ముసలి బాలాకుమారుణ్ని. అన్వర్ భాయిగ్గూడా సిగ్గు లేదా?" సయదా అగ్గిమీద గుగ్గిలమైంది. వంశగౌరవం అంటూ నచ్చజెప్పబోయాడు జమాల్. ఎవరూ ఒప్పుకోలేదు. "మలికా! మీ అమ్మ మిమ్మల్ని నెత్తినెక్కించుకుంది".

"నాన్నా! మలిక నరాల స్వరాల తెగింపు రాగమాలాపిస్తున్నాయి.

"మన పరువు ఎటూ పోదు. నేను బుర్ఖా వేసుకునే బయటికెళ్తున్నాను. రోజూ నమాజు చేస్తున్నాను. అల్లా నాకు అన్యాయం చెయ్యడు".

"సరే.. నేనీ పిల్లలకు పెళ్లిసంబంధాలు చూడను" అని జమాల్ బయటికెళ్లాడు.

మర్నాడు మలిక బట్టల కోసం దర్జీమాస్టారు వద్దకెళ్లింది.

"మిషన్ కొనిస్తాగానీ, నెలకెంత కడ్తావు?"

"ఇప్పటికంటే ఎక్కువ బట్టలు కుట్టి మిషన్ అప్పు తీర్చేస్తా. ఆ తర్వాత ఇంకో మిషన్ ఇప్పించాలి. కష్టపడి అప్పు తీర్చేస్తా"

దర్జీమాస్టారు ఫోన్ చేశాడు. మిషన్ వచ్చేసింది. మలిక సంతోషంతో మిషన్ను ఆటోలో వేసుకుని ఇంటికొచ్చింది. తన వెంట కుట్టే బట్టలు ఎక్కువ తెచ్చుకుంది. ఆడదంటే అబల కాదని నిరూపించాలనే పట్టుదల మలికలో పెరిగిపోయింది.

"అక్కా! నేను కూడా నీతో పాటు బట్టలు కుడతా" హుషారుగా అంది సల్మా.

"ముందు మిషన్ అప్పు తీర్చేందుకు కష్టపడదాం" సయదా ప్రోత్సాహం ప్రాణవాయువైంది.

దివారాత్రాలు బట్టలు కుడుతున్నారు. మలిక కటింగ్ గూడా నేర్చుకుంది.

రింసా ఫీజు కట్టేసింది మలిక. పుస్తకాలు, డ్రెస్సు కొనిచ్చింది. మలిక, సయదా, సల్మా ఒకరి తర్వాత ఒకరు కుడుతూనే వున్నారు. మిషన్ ఆగడం లేదు. బట్టలు సరిగ్గా, సైజుల వారీగా బాగుంటున్నాయనే మంచి పేరొచ్చింది.

దర్జీమాస్టారు ఆడవాళ్ల బట్టలన్నీ వీళ్లకే ఇస్తున్నాడు. అందరూ మెచ్చేలా కుట్టి యిస్తున్నారు. అప్పు తరిగిపోయింది, ఇంటి పరిస్థితి మెరుగైంది. ఇరుగు–పొరుగు, వీధిలోని ఆడవాళ్ల బట్టల్ని నేరుగా తీసుకుని కుట్టిస్తున్నారు.

భార్య, కూతుళ్ల ఉత్సాహం చూస్తుంటే జమాల్ తల సిగ్గుతో వంగిపోయింది.

దర్జీమాస్టారుకు తృప్తిగా వుంది. మిషన్ అప్పు పూర్తిగా తీరిపోయింది.

ఆరోజు సయదా మలిక కుట్టిన బట్టలు తెచ్చి మాస్టారుకిచ్చారు.

"మీ పని చాలా బాగుందమ్మా!" మెచ్చుకున్నాడాయన.

"మిషన్ అప్పు తీరగానే మరోటి ఇస్తామన్నారుగదా!" గుర్తు చేసింది మలిక.

దర్జీమాస్టారు సయదాతో "అమ్మా! మలిక చాలా హుషారుగా ఉంది. మీ అదృష్టమమ్మా. నాల్గు రోజుల్లో మరో మిషన్ తెప్పించిస్తా" ఉత్సాహం చూపించాడు.

కాలం పరుగెడుతూనే వుంది. మరో మిషన్ మీద కూడా బట్టలు కుడుతున్నారు. అలుముకున్న నిరాశా నిస్పృహలని ధైర్యం ఆత్మవిశ్వాసమై తరిమేసింది. ఇంటిని తీర్చిదిద్దుతున్నారు. ఇంటి ముందు భాగంలో కుట్టిన డ్రెస్సులు ప్రదర్శిస్తున్నారు. అదో షోరూమ్‌లా కనబడుతోంది.

జమాల్ కూడా సహకరిస్తున్నాడు.

ఆరోజు పండగ.. ఇల్లంతా సందడిగా వుంది. అమ్మా, నాన్న, అక్క చెల్లెళ్లంతా కొత్తబట్టలు ధరించారు. పండగ ప్రసాదం అందరికీ పంచారు. సేమ్యా పాయసం సేవించారు. మేనత్త, మేనమామలు కలిసేందుకొచ్చారు. సయదా హృదయ కేదారంలో ఆనంద పుష్పం వికసించింది. కళ్లల్లో నీళ్లు తిరిగినై.

"ఏమైంది సయదా?" మేనత్త అదుర్దా.

"పాత రోజులు గుర్తుకొచ్చినై వదినా!" ఆనందాశ్రువులను కొనకొంగుతో అద్దుకుంది.

"కడుపునిండా తిండి, కొత్త బట్టల కోసం అల్లాడిపోయినం. ఒక్కోసారి ఆత్మహత్య చేసుకోవాలన్పించేది, కానీ పిల్లలు అనాథలైపోతారని భయమైంది".

మలికలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. "అమ్మా! పాత రోజులు గుర్తు చెయ్యకు. ఇవ్వాళ పండగ. అందరం సంతోషంగా ఉందాం".

మేనత్త మలికను గుండెలకు హత్తుకుంది. "నువ్వు ఈ ఇంటి దేవతవమ్మా. నరకంలా వున్న ఇంటిని స్వర్గంలా మార్చావు".

మలిక కోసం మంచి సంబంధాలొస్తున్నై. మలిక కొడుకు కన్నా మిన్న. ఈ ఇంటి గౌరవాన్ని నిలబెట్టింది. జమాల్ సంతోష తరంగం.

అందరి అంగీకారంతో మలికకు పెళ్లి ఖాయమైంది. అబ్బాయి సద్గుణశాలి. ఉద్యోగం చేస్తున్నాడు.

సయదా దర్జీ మాస్టారును కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వదించింది. ఇంతలో 'పోస్ట్' అన్న కేక వినబడింది. రేష్మా గుమ్మం వద్దకెళ్లి కవరందుకుని విప్పి చదివింది... లేడిపిల్లలా ఎగిరి గంతేసింది.

"మలికక్కా! నాకుద్యోగం దొరికింది. ఇదో ఆర్డరు కాయితం" అని అందరికీ చూపించింది. "నువ్వు ఫీజు కట్టకపోతే నా చదువు ఆగిపోయేదక్కా!"

మలికకు ఏనుగెక్కినంత హుషారుగా వుంది. "చెల్లీ! నీకు దూరదర్శన్‌లో ఉద్యోగం దొరికింది. నువు బాగా చదివి భవిష్యత్తును బంగారం చేసుకోవాలనుకున్నాను. నా కల నిజమైంది" ఆత్మీయాలింగనంతో నుదురు ముద్దాడింది.

తండ్రి ముందుకెళ్లి "నాన్నా! నేను నా చెల్లెళ్ల భవిష్యత్తుకు బాటలు వేసి వాళ్ల మొహాల్లో వెలుగులు చూడాలనుకున్నాను" ఆనందం వెలిబుచ్చింది.

జమాల్‌లో వాత్సల్యం పొంగుకొచ్చింది.

# రసగంగాధర తిలకం 'తిలక్'

తెలుగు సాహిత్యంలో, అభ్యుదయ భావాలకు రమ్యమైన శైలి చేకూర్చి, కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటధారిగా నవనవాలైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించి 'అమృతం కురిసిన రాత్రి' వర్షింపచేసిన సౌందర్య రససిద్ధుడైన వచన కవితా హృదయ అమృత స్పర్శవాది బాలగంగాధర తిలక్. అనుభూతివాదిగా మానవీయ పతాకను ఆవిష్కరించారు. 16వ ఏట ప్రభాతం-సంధ్య కవితా సముచ్చయంతో ప్రారంభమైన తిలక్ ప్రస్థానం, ఆధునిక వచన కవితా శిల్పిగా తెలుగు సాహిత్యాన్ని అమృతమయం చేసింది. గోరువంకలు, శర్వరీప్రియ వంటి పద్య ఖండికలతో ప్రారంభమైన తిలక్ క్రమేపీ కవిత, కథ, నాటిక ప్రక్రియలలో అనుభూతి, వేదన, సామాజిక జీవన పార్శ్వాలుగా తెలుగు సాహిత్యాన్ని మలుపు తిప్పారు. సామాజిక భావాలను, సంఘటనలను అతిసరళమైన తెలుగు పదాలు, నుడికారం, అభివ్యక్తి వైవిధ్యాలతో అద్భుతంగా కవితాత్మకం చేసే నూతన కవితా మార్గ నిర్మాణానికి నాంది పలికారు. 'నా అక్షరాలు వెన్నెలలో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు' వంటి అద్భుత భావచిత్రాలు, సౌందర్య మిళితమైన వాస్తవ భావ ప్రధానంగా తిలక్ కవితలలో సాక్షాత్కరింపచేసారు.




**"నా కవిత్వం కాదొక తత్వం**
**మరికాదు మీరనే మనస్తత్వం**
**కాదు ధనికవాదం, సామ్యవాదం"**

స్వాతంత్ర్యానంతర కాలంలో ఏ ఇజాలకు లొంగని భావజాలాన్ని వస్తువుగా స్వీకరించటం, అభివ్యక్తిలో ధ్వని ప్రధానమైన కవితా ప్రయోగాలతో వేదనాయుత భావన రసానుభూతిగా నాటి సమాజంలోని ఫ్యూడల్ ఛాందసత్వాన్ని వ్యతిరేకించారు.

**"దేవుడా రక్షించు నా దేశాన్ని పవిత్రుల నుండి పతివ్రతల నుండి**
**పెద్ద మనుషుల నుండి పెద్ద పులుల నుండి**
**లక్షలాది దేవుళ్ల నుండి వారి పూజారుల నుండి**
**సిద్ధాంత కేసరుల నుండి సిద్ధుల నుండి**
**శ్రీ మన్మథ్గురు పరంపర నుండి"** అంటారు.

11వ ఏట తొలి కథ 'మాధురి' రచించిన తిలక్ కవితలలో కారుణ్యం, ప్రేమ, దయ, సానుభూతి, మానవతా కాంతి ప్రసరింప చేసారు. ఈనాటిదాకా సామాజిక కవులం దరూ ప్రేమించే భావానుభూతికి ఆద్యులు తిలక్ అంటారు.. వచన కవితా పితామహుడు కుందుర్తి. తిలక్ కవితాచరణ పరిణామం స్వచ్ఛమైన అనుభూతివాదం గుండెలోని చీకటి కోణాల మీద అనేక ఖండికలు మహాశక్తివంతమైన బ్యాటరీ దీపాలు అంటారు 1966 నవంబరు సృజనలో అద్దేపల్లి రామమోహనరావు. 1955-66 జీవిత కాలంలో తిలక్ మహోజ్వల ఘట్టంగా కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేసే అరుదైన గొంతుతో తెలుగు కవితా రసజ్ఞులను పరవశింపచేసే కవితలు రచించారు. శిఖరారోహణం(1966), తపాలా బంట్రోతు(1959), అమృతం కురిసిన రాత్రి(1962), అదృష్టాధ్వగమనం (1964), న్యూ సిలబస్(1962), త్రిశూలం(1962), విరహోత్కంఠిత(1963), నిన్నరాత్రి(1964), బాధాగళం(1964), కిటికీ(1965), అద్వైత మాన్మథం(1966).. ఇంకా ఎన్నో కవితలు నేటికీ కవితా ప్రియులను అలరిస్తున్నాయి. రష్యన్, హిందీ తదితర భాషలలోకి అనువాదం పొందాయి. 'కవికుల తిలకునిగా' సరళ సుందరమైన కవితా దీపాలను వెలిగించిన తిలక్, మరణానంతరం 'అమృతం కురిసిన రాత్రి' 93 కవితల అద్భుత సమాహారంగా ప్రచురణకు నోచుకుంది. ఆకాశంమీది అప్సరసలు నన్ను చూసి కిలకిలా నవ్వి ఇలా అన్నారు.. అంటూ "ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు" అంటూ "అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్ర పోతున్నారు" అంటూ మానవుని అమరత్వం ఈ కవితలో అద్భుతంగా కవితాత్మకంగా ప్రతిపాదించారు.

సమకాలీన సమాజ నడవడికపై అద్దంలో జిన్నా(1961), త్రిశూలం(చైనా దురాక్రమణ 1962), నెహ్రూ(1964), శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, విశ్వనాథ ముగ్గురి ప్రస్తావనతో త్రిమూర్తులు(1966) వంటి వైవిధ్యభరితమైన కవితలు కూడా రచించారు. 1966 జులై 1న దేవరకొండ బాలగంగాధర తిలక్ 45వ ఏట కన్ను మూయడంతో- శ్రీశ్రీ నడివయసులోనే కనుమరుగయిన తిలక్ గురించి రాసిన ఎలిజీ హృదయాన్ని కదిలిస్తోంది.

**"గాలి మూగదయిపోయింది**
**పాట బూడిదయిపోయింది**
**వయస్సు సగం తీరకముందే**
**అంతరించిన ప్రజాకవి**
**నభస్సు సగం చేరకముందే**
**అస్తమించిన ప్రభారవి**
**మరి కనిపించడా?"**

కవితాసతి నొసట నిత్యరస గంగాధర తిలకం అన్నారు శ్రీశ్రీ. మతతత్వం, కులతత్వం, పార్టీతత్వం, సిద్ధాంతాలు, విప్లవాలు, యుద్ధోన్మాదాన్ని తిలక్ నిరసించారు. **"పులి చంపిన లేడి నెత్తురు పులుముకోలేను ఖడ్గ మృగోదగ్ర విరావం ఆలకించలేను జగద్ధాత్రి నీ కుమారులమైన మేము తత్వాల పేర, విప్లవాల పేర ఒకరినొకరం హతమార్చుకోలేం"** అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సోషలిజాన్ని వ్యక్తిత్వాన్ని అభిమానించిన తిలక్.. జవహర్ మరణించినప్పుడు ఆర్ద్రమైన కవిత రాశారు. తిలక్ కవిగా చాలా సున్నితమైన, సంస్కారవంతమైన కాల్పనిక సౌందర్య రస హృదయుడు. రచనలలో మొత్తం 18 పద్య ఖండికలు, గేయాలు, వచన, పద్య కవితలు 86, కథానికలు 30, నాటకాలు, నాటికలు, లేఖల సంపుటి మొదలైనవి వెలుగు చూసాయి. తిలక్ కవిత్వంలో అడుగడుగునా విషాద స్పృహ తగులుతూ ఉంటుంది.

తిలక్ కవిత్వంలో భావ కవిత్వ వారసునిగా విషాద అలంకారిత ధ్వనిస్తుంది. "నా **అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయాపారావతాలు"** అన్నారు. నవ భావామృత రసధునిగా భాసించిన ఉత్తమ కవిగా తిలక్ తన హృదయానుభూతితో తెలుగు కవిత్వాన్ని, అనర్గళం అనితరసాధ్యంగా ప్రభావితం చేసారు.

**- జయసూర్య**

# కలర్‌ఫుల్ పండుగలు

అందరూ అన్ని పండగలు చేసుకున్నప్పటికీ ఒక్కో దేశం ఒక్కో పండగకు పేరు పొందింది. మనం హోలీ పండగను రంగుల పండగగా జరుపుకుంటాం కదా. అలాగే ప్రపంచంలోని ఒక్కో దేశంలో జరిగే కలర్‌ఫుల్ పండగలను గురించి తెలుసుకుందాం.

## హోలీ



ఇండియాలో హిందువులు జరుపుకునే ప్రధానమైన పండగ ఇది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఇది కలర్‌ఫుల్‌గా ఉంటుంది.

## దే ఆఫ్ ద డెడ్



దే ఆఫ్ ద డెడ్ మెక్సికో ప్రజలు జరుపుకునే ప్రధాన పండుగ. జీవిస్తున్న వారితో చనిపోయినవారు పండగరోజు కలుస్తారని అక్కడి ప్రజలు విశ్వసించి ఈ పండగను జరుపుకుంటారు.

## లాటమాటిన

ఈ లాటమాటిన పండగను స్పెయిన్‌లో జరుపుకుంటారు. స్పెయిన్‌లో



బునోల్‌లో ఆగస్టు 30న ఈ పండగ జరుగుతుంది. ఈ పండుగ ఒక ఆటలా ఎంతో బాగుంటుంది.

## మర్డి గ్రాస్



ఈ పండగను అమెరికాలో జరుపుకుంటారు. ఈ పండగలో విచిత్ర వేషధారణలు, స్ట్రీట్ పార్టీలతో చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది.

## చైనీస్ న్యూ ఇయర్



చైనా ప్రజలు జరుపుకునే కొత్త సంవత్సరం వేడుకలు ఎంతో కలర్‌ఫుల్‌గా ఉంటాయి. ప్రత్యేక పూజలు, నాటక ప్రదర్శనలు, నోరూరించే వంటకాలతో ఈ పండగ చాలా కలర్‌ఫుల్‌గా ఉంటుంది.

## రియో కార్నివాల్

బ్రెజిల్‌లోని రియో డీ జనిరోలో జరిగే





ఈ కార్నివాల్ ప్రపంచంలోనే అత్యంత సందడి కలిగిన పండగ. రంగు రంగుల దుస్తులు, ప్రత్యేక అలంకరణలతో ఈ పండగ ఎంతో బాగుంటుంది.

## కార్నివాల్ ది వెనిస్



ఇటలీలో జరిగే ఈ కార్నివాల్ ఆఫ్ వెనిస్‌లో అనేక రకాల ఆటలు, సరదాలు ఉంటాయి. ప్రత్యేక అలంకరణలు, సాంప్రదాయ సంగీతంతో ఈ పండుగ చాలా బాగుంటుంది.

## మసక్కరా ఫెస్టివల్

ఈ పండుగను ఫిలిప్పీన్స్‌లో జరుపుకుంటారు. జీవితంలో సమస్యలను, కష్టాలను తొలగించుకు నేందుకు ఈ పండగను జరుపుకుం టారు. ఈ పండుగ ఎంతో కలర్‌ఫుల్‌గా ఉంటుంది.

## హనామీ

జపాన్‌లో జరుపుకునే ఈ పండుగకు చెర్రీ బ్లోసమ్ అనే పేరు కూడా ఉంది. మార్చి నుంచి మే వరకు జరుపుకునే ఈ హనామీ ప్రపంచంలోని అత్యంత అందమైన పండుగల్లో ఒకటి.





ఇతిహాసాల ప్రకారం మరణశయ్యపై ఉన్న ముంతాజ్ తన భర్త షాజహాన్‌ను నాలుగు కోరికలు కోరింది. తన సమాధిపై తాజ్‌మహల్‌ను నిర్మించడం, ఆమె మరణానంతరం అతను మళ్లీ పెళ్లి చేసుకోవడం, ముంతాజ్ మహల్‌కు పుట్టిన పిల్లలను ప్రేమగా చూసుకోవడం, ఆమె మరణించిన రోజున(వర్ధంతి) సమాధిని సందర్శించడం.. ఈ నాలుగు కోరికలు కోరిందని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.1631వ సంవత్సరంలో షాజహాన్ చక్రవర్తిగా ఉన్న కాలంలో మొఘల్

# మహాద్భుతం 'తాజ్‌మహల్'

**షేక్ అబ్దుల్ హాకీం జాని**

ఆధునిక ప్రపంచ వింతల్లో ఒకటిగా విరాజిల్లుతున్న రమ్యాతి రమ్యమైన పాలరాతి మహాద్భుత నిర్మాణం తాజ్‌మహల్. ప్రేమకు చిహ్నంగా నిర్మించిన ఈ దివ్య, భవ్య నిర్మాణం గురించి ప్రపంచ వ్యాప్తంగా ఎంత గుర్తింపు ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో నెలకొని ఉంది. మొగలుల కళావికాసానికి పరాకాష్ట తాజ్‌మహల్. ఆధునిక ప్రపంచ వింతలలో ఒకటిగా ప్రపంచ ప్రజల మన్ననలు పొందింది. ఆగ్రాలోని తాజ్‌మహల్‌కు వచ్చిన గుర్తింపు బహుశా భారతదేశంలో ఏ కట్టడానికీ వచ్చి ఉండకపోవచ్చు. చలనచిత్రాలు, కావ్యాలలో ప్రేమకు చిహ్నంగా ఈ కట్టడాన్ని అభివర్ణించడం గమనార్హం. నిజమైన ప్రేమకు చిహ్నంగానే కాక ప్రపంచంలోని పర్యాటకులను విశేషంగా ఆకర్షించే పర్యాటక కేంద్రంగా తాజ్‌మహల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. యునెస్కోవారు 1983లో తాజ్‌మహల్‌ను ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించారు. "భారతదేశంలో ఉన్న ముస్లిం కళ ఆభరణం" అని దీన్ని ప్రపంచ ప్రజలు కొనియాడుతున్నారు. 2007లో ఆధునిక ప్రపంచ ఏడు వింతల్లో ఒకటిగా చోటు దక్కించుకుంది. భారతీయ, ఇస్లామిక్, పర్షియన్ నిర్మాణ శైలిలో రూపు దిద్దుకున్న ఈ కట్టడాన్ని 22 సంవత్సరాల పాటు కష్టించి దాదాపు 20 వేల మంది కార్మికులు నిర్మించారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన తాజ్‌మహల్ వెనుక చాలా మందికి తెలియని ఆశ్చర్యపరిచే వాస్తవాలు ఉన్నాయి. మొఘల్ సామ్రాజ్య శిల్పకళకు సంబంధించిన ఒక ఉత్కృష్ట నిర్మాణం అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొంది. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన రాణి ముంతాజ్ మహల్ స్మృతిచిహ్నంగా దీనిని నిర్మించారు.

**ప్రియసతి చివరి కోరిక**

షాజహాన్ చక్రవర్తి తన ప్రియమైన భార్య ముంతాజ్ మహల్ జ్ఞాపకార్థంగా ఆమె సమాధిపై తాజ్‌మహల్‌ను నిర్మించారు.

సామ్రాజ్యం గొప్ప సంపదతో విరాజిల్లింది. ఆ సమయంలో షాజహాన్ మూడవ భార్య అయిన ముంతాజ్ మహల్ వారి పద్నాలుగో సంతానం గౌహరా బేగానికి జన్మనిస్తూ మరణించడంతో షాజహాన్ విచారంతో నిండిపోయారు. చివరి దశలో ఉన్న ముంతాజ్ మహల్ షాజహాన్‌ను ప్రపంచంలో ఎవరూ ఇంతవరకు చూడని అత్యంత సుందరమైన సమాధిని తన కోసం నిర్మించమని కోరింది. షాజహాన్ తన భార్య కోరిక సమ్మతించి ఆమె మరణించిన ఒక సంవత్సరం తరువాత 1632వ సంవత్సరంలో తాజ్‌మహల్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ముంతాజ్ కోరికపై ఆమె సమాధిపై కట్టించిన కట్టడమే తాజ్‌మహల్. దీని నిర్మాణం క్రీ.శ.1632లో ప్రారంభమై క్రీ.శ.1653 వరకు దాదాపు ఇరవై సంవత్సరాల పైచిలుకు సాగింది. తాజ్‌మహల్ నిర్మాణానికి వేలాది మంది కూలీలు, శిల్పులు నిర్విరామంగా శ్రమించగా సారథ్యం వహించింది ఇరాన్ దేశస్థుడైన ఇషాఖాన్. దీని అందాలు మెరుగులు దిద్దేందుకు ఫ్రెంచ్ దేశస్థుడైన ఆస్టిన్ ఆఫ్ జోర్డాక్స్, వెరోనియో అనే వెనిస్ నగర వాస్తు పండితుడు పాలు పంచుకున్నట్లు ఆ కాలపువాడైన మాన్‌రిక్ అనే మతప్రచారకుడు చరిత్రలో పేర్కొన్నాడు. ఇంకా అబ్దుల్ కరీం మామూర్ ఖాన్, మక్రమత్ ఖాన్, ఉస్తాద్ అహ్మద్ లాహూరి వంటి శిల్పులు దీని నిర్మాణంలో సారథ్యం వహించారు. తాజ్‌మహల్ నిర్మాణంలో పారశీకత హెచ్చుగా కనిపిస్తుంది. ఉత్తరం వైపున తాజ్‌గేట్, మిగిలిన మూడు వైపులా దర్వాజాలతో బలిష్టమైన ఎర్రరాతి గోడ దీనికి రక్షణగా వుంది. మూడంతస్తుల తాజ్‌గేట్ పైభాగం ముప్పై అడుగుల ఎత్తులో దివ్య ఖురాన్ సూక్తులు అద్భుతంగా చెక్కారు. యాభై రెండు మీటర్ల ఎత్తుగల సెంట్రల్ డోమ్ కింది భాగంలో షాజహాన్, ముంతాజ్ బేగంల సమాధులున్నాయి. షాజహాన్‌కు ముందే ముంతాజ్ మరణించింది. ఆమె శవాన్ని తాజ్‌మహల్ సెంట్రల్ డోమ్ కింద ఖననం చేసి ఆ సమాధిపై దివ్య ఖురాన్ సూక్తులను అద్భుతమైన డిజైన్‌లుగా చెక్కించారు షాజహాన్. భార్య కోరిన విధంగా ముంతాజ్‌ను ఖననం చేసినప్పటికీ షాజహాన్ మాత్రం

తన కోరిక నెరవేర్చుకోలేకపోయారు. అనేక చారిత్రక కథనాల ప్రకారం షాజహాన్ నల్లని రాతిని ఉపయోగించి మరో తాజ్‌మహల్‌ను నిర్మించాలని భావించాడట. యమునా నది ఇవతలి ఒడ్డున తెల్ల పాలరాయితో నిర్మించిన తాజ్‌మహల్‌లో భార్య సమాధి పూర్తి పూర్తయిన తరువాత అవతలి ఒడ్డున నల్ల చలువరాతితో తాజ్‌మహల్ నిర్మింపజేసి అందులో తన సమాధి నిర్మించుకోవాలని షాజహాన్ భావించారు. నల్ల తాజ్‌మహల్ ప్రాథమిక దశ పనిని ప్రారంభించినప్పటికీ ఆ నిర్మాణం నిలిచిపోయింది. తన కుమారులతో మనస్పర్థలు పెరగడం వలన షాజహాన్ చక్రవర్తి ఆ నిర్మాణం మొదలుపెట్టలేకపోయారు. ఆ నిర్మాణానికి వారసులు కూడా ఒప్పుకోలేదు. షాజహాన్ ఈ విధంగా కట్టడాలకు విపరీతమైన ధనాన్ని దుర్వినియోగం చేయడం నచ్చని అతని కుమారుడు ఔరంగజేబు రాజ్యానికొచ్చారు. తండ్రిని ఆగ్రాలోని ఎర్రకోటలోగల సమ్మన్ బురుజులో బంధించాడు. షాజహాన్ ఆగ్రా ఎర్రకోట నుండి ప్రతిరోజూ తాజ్‌మహల్‌ను తిలకిస్తూ అక్కడే పరమపదించారు. తరువాత ఔరంగజేబు తన తల్లి సమాధి పక్కనే తాజ్‌మహల్‌లో తండ్రిని కూడా ఖననం చేసి దానిపై అద్భుతమైన డిజైన్ చెక్కించాడు. ఈనాటికీ యాత్రికులు తాజ్‌మహల్‌లోని సమాధులు గుర్తించాలంటే ఒక్కటే గుర్తు. ఖురాన్ సూక్తులు ఉన్నది ముంతాజ్‌బేగం సమాధి. డిజైన్‌లు ఉన్నది షాజహాన్ చక్రవర్తి సమాధి. తాజ్‌మహల్ సెంట్రల్ డోమ్ కింద రెండు సమాధులు కనిపిస్తాయి. ఇవి సమాధి ఆకారాలు మాత్రమే. వీటి అడుగు భాగంలో భూగర్భంలో నిజమైన సమాధులు ఉన్నాయని స్థానిక గైడ్స్ చెబుతుంటారు. షాజహాన్, ముంతాజ్ అసలు సమాధులు ఉన్న భూగర్భ ప్రదేశంలోకి పర్యాటకుల్ని అనుమతించరు. పై భాగంలో ఒక ఇనుప జల్లెడను ఏర్పాటు చేసి అందులో నుండి నిజమైన సమాధులు చూసే అవకాశం కల్పించారు.



## భూకంపాలను తట్టుకునేలా నిర్మాణ చాతుర్యం

షాజహాన్ కోరిక ప్రకారం బ్లాక్ తాజ్‌మహల్ తయారయినట్లయితే భారతదేశంలోనే అది అపురూప కట్టడమయ్యేదని చరిత్రకారుల అంచనా. 800 అడుగుల పొడవు, 1000 అడుగుల వెడల్పుగల ఉద్యానవనం మధ్య భాగంలో తాజ్‌మహల్ వుంది. మధ్యలో నిర్మించిన కొలనులోని నీటిలో తాజ్‌మహల్ ప్రతిబింబిస్తూ అద్భుతంగా కనిపిస్తుంది. తాజ్‌మహల్ పునాది మొదట నాలుగున్నర అడుగులు ఎర్రరాయితో నిర్మించారు. మిగిలిన భాగమంతా తెల్లని రాయితో నిర్మించారు. దీని నాలుగు మూలలా నాలుగు మీనారులున్నాయి. వీటి నుండి పైకి చేరడానికి మెట్లున్నాయి. ఈ మీనారులు 140 అడుగుల ఎత్తు వుండి వెలుపల వైపుకు కొద్దిగా వంగినట్లు కనిపిస్తాయి. ఇలా ఈ స్తంభాలు వంగి వుండడానికి ఒక కారణముంది. ఏవైనా తుఫానులు, భూకంపాలు వంటి ప్రమాదాలు వచ్చి ఈ స్తంభాలు ఏది నేలకు ఒరిగినప్పటికీ మధ్యలో డోమ్‌పై పడకుండా బయట వైపుకు పడేలా వాటిని రూపొందించారు.

తాజ్‌మహల్‌కు ఇరువైపులా రెండు అతి పెద్ద మసీదులను అద్భుత శిల్పశైలిలో నిర్మించారు. ఇవి అదనపు ఆకర్షణగా కనిపిస్తాయి. తాజ్‌మహల్‌కు నిర్మాణంలో పనిచేసిన కూలీలు అటువంటి మరో నిర్మాణం చేయకుండా షాజహాన్ చక్రవర్తి వారి చేతులను నరికివేశారని గాథలు ప్రచారంలో ఉన్నాయి. దీనికి ఎలాంటి ఆధారాలు లేవు అని కొందరి వాదన. ఎందుకంటే తాజ్‌మహల్ నిర్మించినవారే ఎర్రకోటని కూడా నిర్మించారట. ఉస్తాద్ అహ్మద్ లహౌరి అనే వ్యక్తి ఆర్కిటెక్ట్‌లందరికీ లీడర్. తాజ్‌మహల్ నిర్మాణం తర్వాత అతను చాలా కట్టడాలను నిర్మించాడని సమాచారం. అయితే అటువంటి మరో నిర్మాణం ఎక్కడా చేయకూడదని కార్మికులచేత లిఖితపూర్వకంగా షాజహాన్ రాయించుకున్నట్లు తెలుస్తుంది.

## పలు రూపాల్లో తాజ్‌మహల్

తాజ్‌మహల్‌కున్న మరొక ప్రత్యేకత ఏమిటంటే పలు రూపాల్లో కనిపిస్తుంది కట్టడం. రోజంతా దాని రంగు మారుతూ ఉంటుంది. తెల్లని పాలరాయితో తయారు చేసినందువల్ల సూర్యకిరణాలు దానిని తాకినప్పుడు దాని రంగు పసుపు రంగులోకి మారుతుంది. సూర్యాస్తమయం జరుగుతున్నప్పుడు నెమ్మదిగా నీలం రంగులోకి మారుతుంది. ఈ విధంగా రంగులు మారడానికి షాజహాన్‌కు, ముంతాజ్ మహల్‌పై ఉన్న ప్రేమ కారణమని అంటారు. ఎలాగంటే ముంతాజ్ మరణానంతరం ఏ విధంగానైతే షాజహాన్ రూపు, రంగులో మార్పులు చోటు చేసుకున్నాయో.. ఆ విధంగానే తాజ్‌మహల్ కూడా రంగులు మారుస్తుందని ప్రణయ కవులు తమ కవితల్లో వర్ణిస్తుంటారు.

## తాజ్‌మహల్ ప్రత్యేకతలు

శతాబ్దాలు గడిచినా నేటికీ తాజ్‌మహల్ చెక్కుచెదరకుండా నిలిచిందంటే అందులో వినియోగించిన సాంకేతికత, నిర్మాణ సామగ్రి ఎంతో దృఢమైనదని నమ్మక తప్పదు. తాజ్‌మహల్ నిర్మాణం కోసం వినియోగించిన సామగ్రిని ఒకచోట నుంచి మరో చోటుకు తరలించేందుకు దాదాపు వెయ్యి ఏనుగులను వినియోగించారు. తాజ్‌మహల్‌కు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. తాజ్‌మహల్ అనగానే కేవలం పాలరాతి నిర్మాణం మాత్రమే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తుంది. కానీ దానిని నేరుగా సందర్శించి



నిశితంగా పరిశీలించిన వారికి ఓ ప్రత్యేకత కనిపిస్తుంది. ఈ నిర్మాణంపై ఉండే వివిధ డిజైన్లను 28 రకాల విలువైన రాళ్లతో చెక్కారు. దగ్గరగా వెళ్లి చూస్తే ఇది స్పష్టంగా తెలుస్తుంది. సుమారు 22 సంవత్సరాలపాటు కష్టించి నిర్మించిన ఈ కట్టడంలో వినియోగించిన సామాగ్రి ఎక్కడెక్కడి నుంచి తీసుకువచ్చారో తెలిస్తే ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతారు.

ఇంటీరియర్ డిజైన్‌లో 28 రకాల అరుదైన, విలువైన రాళ్లను ఉపయోగించారు. వీటిని భారతదేశంలోని పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాలతో పాటు విదేశాలైన ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, చైనా, టిబెట్, అరేబియా నుంచి తాజ్‌మహల్ నిర్మాణ సామాగ్రిని తీసుకువచ్చారు. ఈ నిర్మాణంపై ప్రతిచోటా ఖురాన్ ఆయత్‌లు రాసి కనిపిస్తాయి. ముంతాజ్ మహల్ సమాధి కూడా ఓ ప్రత్యేకతతో కూడుకుని ఉంటుంది. ఆమె అసలు సమాధిపై అల్లాకు సంబంధించిన 99 పేర్లు గల కాలిగ్రాఫిక్ శాసనాలు ఏర్పాటు చేశారు. షాజహాన్ తన మూడవ భార్య ముంతాజ్



మహల్‌పై ప్రేమకు గుర్తుగా తాజ్‌మహల్‌ను నిర్మించాడనే విషయం అందరికీ తెలిసిందే. ముంతాజ్ మహల్ పేరు మీదే ఈ కట్టడానికి తాజ్‌మహల్ అనే పేరు ఏర్పడింది. అయితే ముంతాజ్ మహల్ అసలు పేరు అది కాదు. ఆమె అసలు పేరు 'అర్జుమండ్ బానో బేగమ్'.

**వెన్నెలలో సుందర తాజ్**

రాత్రివేళ వెన్నెల వెలుగుల్లో తాజ్‌మహల్‌ను వీక్షించడం నిజంగా ఒక గొప్ప అనుభవం అని చెప్పవచ్చు. ఎందుకంటే రోజంతా ఒకేలా కనిపించే ఈ నిర్మాణం చంద్రుడి వెలుగుల్లో కొత్త రంగులను అద్దుకుంటుంది. అదేవిధంగా కొన్ని కొన్ని సందర్భాల్లో సూర్యాస్తమయ సమయంలో



కూడా తాజ్‌మహల్ రంగు విభిన్నంగా కనిపిస్తుంది. ఆగ్రాలో యమునా నది ఒడ్డునగల తాజ్‌మహల్‌ను పున్నమి వెన్నెలలో చూడడానికి దేశ విదేశాల నుండి ఎందరో యాత్రికులు విచ్చేసి మిరుమిట్లు గొలిపే దాని అందాన్ని ఆస్వాదిస్తారు. వెన్నెల్లో తాజ్‌మహల్ చూడడం ఎందరో కళాభిమానుల కలగా చెప్పవచ్చు. ప్రతి ఏడాది జరిగే తాజ్ మహోత్సవాల సందర్భంగా సుప్రసిద్ధ కళాకారులు, సంగీత విద్వాంసులు తమ కళను తాజ్‌మహల్ ప్రాంగణంలో ప్రదర్శిస్తారు. పున్నమి వెన్నెలలో తాజ్‌మహల్‌ను తిలకించడం ఓ మధురానుభూతి అని చెప్పవచ్చు.

తాజ్‌మహల్ ఎదురుగా ఒక రాతి బెంచీని ఏర్పాటు చేశారు. దేశ విదేశాల నాయకుల నుండి సామాన్య ప్రజల వరకు ఈ బెంచీపై కూర్చుని ఫొటోలు దిగడం ఆనవాయితీ. తాజ్‌మహల్ చూడటానికి కొన్ని మెట్లు ఎక్కాలి. ఆ మెట్ల పక్కనే గోడలో ఏర్పాటు చేసిన చిన్న రంధ్రం గుండా అనునిత్యం నీళ్ల వస్తూనే ఉంటాయి. సందర్శకులు కాళ్లు కడుక్కుని తాజ్‌మహల్ వద్దకు వెళ్లేందుకు ఈ ఏర్పాటు చేశారు.

**తాజ్ పరిరక్షణ అందరి బాధ్యత**

ఈజిప్ట్ పేరు చెప్పగానే పిరమిడ్‌లు, ప్యారిస్ అనగానే ఈఫిల్ టవర్, న్యూయార్క్ పేరు వింటే స్వేచ్ఛా ప్రతిమ, చైనా పేరు చెప్పగానే చైనా గోడ ఏ విధంగా గుర్తుకు వస్తాయో భారతదేశం పేరు చెప్పగానే ప్రపంచానికి గుర్తుకు వచ్చేది తాజ్‌మహల్ అని ప్రపంచమంతా తెలుసు. ఇటువంటి రమ్యాతి రమ్యమైన నిర్మాణాన్ని పది కాలాల పాటు పదిలంగా కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.

ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

**ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. క్రయ-విక్రయాలు ఆశించిన రీతిలో ఉంటాయి. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ధర్మ రక్షణకై పాటు పడతారు. ప్రముఖులను సందర్శిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పదవి లభిస్తుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. విహార యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది.

## వృషభం



సంతానాభివృద్ధి గురించి ఆలోచిస్తారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. క్రయ-విక్రయాలు ఆశించినట్లుగా ఉంటాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. కుటుంబ సభ్యుల మధ్య ఐకమత్యం ఏర్పడుతుంది. అనుకోని సంఘటనలు జరిగినా మనోధైర్యంతో ఎదుర్కొంటారు.

## మిథునం



ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుభ కార్యాలకు హాజరవుతారు. ఆరోగ్యం కుదుట పడుతుంది. సామాన్య ధన లాభం. ఉన్నతాధికారులను సందర్శిస్తారు. ఉద్యోగులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. అన్ని వ్యవహారాల్లో విజయం సాధిస్తారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో అందుకుంటారు.

## కర్కాటకం



ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండడం చెప్పదగిన సూచన. విందు-వినోదాల్లో పాల్గొంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. క్రయ-విక్రయాలు లాభసాటిగా ఉంటాయి. స్త్రీల వల్ల సమస్యలు వచ్చే సూచనలున్నాయి కనుక ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ఉద్యోగులకు స్థాన చలనం. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

## సింహం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. స్త్రీలకు శుభ యోగం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారాభివృద్ధి సంతృప్తినిస్తుంది. శారీరక, మానసిక శ్రమకు లోనవుతారు. ప్రత్యర్థుల వల్ల సమస్యలు వచ్చే సూచనలున్నాయి కనుక ఆచి తూచి వ్యవహరించడం మంచిది. నూతన వస్తువులు కొనుగోలు.

## కన్య



తీర్థ యాత్రలు చేస్తారు. ఆకస్మిక ధన లాభం పొందుతారు. శత్రువుల వల్ల ఇబ్బందులుంటాయి. పాత బాకీలు తీరుస్తారు. భాగస్వామ్య వ్యవహారాలు వారాంతంలో పరిష్కారమవుతాయి. దూర దేశ ప్రయాణ సూచనలున్నాయి. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారులకు సామాన్యం.

## తుల



ఆరోగ్య సమస్యలుంటాయి. సహనం అలవరచుకోవడం మంచిది. దేశాంతర ప్రయాణం చేస్తారు. వృత్తి వ్యాపారస్తులకు ఆర్థికంగా బాగుంటుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ప్రయత్నాలు ఫలిస్తాయి. శుభ కార్య ఆలోచనలు చేస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బంధు, మిత్రులతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. సంతాన ప్రాప్తి. వ్యాపారులకు శ్రమ అధికం.

## వృశ్చికం



ఉద్యోగులకు ఆశించిన ఫలితాలుంటాయి. విద్యార్థులకు అధిక శ్రమ. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. విదేశీ ప్రయాణ సూచనలున్నాయి. శుభ కార్యాలకు హాజరవుతారు. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అన్ని వ్యవహారాల్లో విజయం సాధించి అందరి మన్ననలు పొందుతారు. సంతానాభివృద్ధి గురించి చేసే ఆలోచనలు వారాంతంలో ఫలిస్తాయి.

## ధనుస్సు



శుభ కార్యాలకు హాజరవుతారు. కుటుంబ సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. ఉద్యోగులకు బాగుంటుంది. శుభ కార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం తెలుసుకుంటారు. వివాదాలకు దూరంగా ఉండడం సముచితం.

## మకరం



కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. వాహన యోగం. వివాహాది శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగస్తులు ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సహనంతో వ్యవహరించడం మంచిది. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. వ్యవసాయదారులకు సామాన్యంగా ఉంటుంది. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.

## కుంభం



క్రయ-విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అనుకోని వార్తలు వింటారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వస్తువుల అమ్మకాలు-కొనుగోలు వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ఋణాలు తీరుస్తారు. వృథా కాలక్షేపం చేస్తారు.దూర దేశ ప్రయాణ సూచనలున్నాయి.

## మీనం



కుటుంబ పేరు ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. విద్యార్థులకు శుభ యోగం. వృథా ఖర్చులుంటాయి. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. వ్యాపారులకు ఋణాలు లభిస్తాయి. వృత్తి వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. బంధువులతో స్వల్ప మనస్పర్థలకు అవకాశాలున్నాయి. సంతానాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. బాల్య మిత్రులను కలుసుకుంటారు.

# చైనా ఊరగాయ





తెలుగువారికి ఊరగాయ లేకుండా ముద్ద దిగదని అంటుంటారు. ఊరగాయ, ఆవకాయ, మాగాయ.. ఇలా మనకైతే చాలా రకాల నిలవ పచ్చళ్లున్నాయి. మరి చైనా, కొరియా దేశ వాసుల ఊరగాయ ఎలా ఉంటుందో చూద్దాం. లాబా గార్లిక్ పచ్చడి చైనాలో బాగా ప్రాచుర్యం పొందిన ఊరగాయ. కొత్త సంవత్సరం రోజున వాళ్లు ఈ ఊరగాయను పెడతారు. పొట్టు తీసిన వెల్లుల్లి రెబ్బల్లో ఉప్పు, పంచదార, రైస్‌వెనిగర్ వేసి పులియబెడతారు. సుమారు నాలుగు వారాలు ఆ మిశ్రమాన్ని ఊరనిచ్చి ఆ తర్వాత మూత తీస్తారు. వెల్లుల్లి పచ్చగా మారి రుచికరమైన ఊరగాయ సిద్ధమవుతుంది. దోసెలు, ఇడ్లీల్లోకి ఆవకాయ వేసుకున్నట్లుగా చైనీయులు దీనిని స్నాక్స్‌తో కలిపి ఎంతో ఇష్టంగా తింటారు. భోజనానికి ముందు ఆకలి పెంచడానికి తింటారు. లాబా గార్లిక్‌లో యాంటీ ఏజింగ్ గుణాలు ఉండటంతో వృద్ధాప్య ఛాయలు త్వరగా రావు. జీర్ణశక్తి పెరిగి ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.

# చల్లదనానికి చిరుధాన్యాలు



ఎండా కాలం సమీపించగానే ఒంటికి చలువ చేసే ఆహార పదార్థాలు తినాలని ఆలోచిస్తాం. అందరికీ తెలిసిన మజ్జిగ, సొరకాయలు మొదలైన వాటితో పాటు చిరుధాన్యాలు సైతం శరీరానికి ఎంతో చల్లదనాన్ని ఇస్తాయి. చిరుధాన్యాల్లో ముఖ్యంగా రాగులు, జొన్నలు, కొర్రలు లాంటివి మేలు చేస్తాయి.

**రాగులు:** వీటిల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. రక్తహీనతతో బాధపడేవారు రాగిజావ తీసుకుంటే త్వరగా కోలుకుంటారు. బెల్లంతో కలిపి తీసుకుంటే ఎక్కువ పోషకాలు అందుతాయి.

**జొన్నలు:** ఇవి ఎండాకాలంలో చలువ చేస్తాయి. 'బి' విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. చర్మం, జుట్టుకి మంచిది. వర్కవుట్లు చేయడానికి ముందు తీసుకోవచ్చు ఫలితాలు మరింత బాగుంటాయి.



**బార్లీ:** బార్లీ నీళ్ల తాగుతుంటే శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. తద్వారా మూత్ర సంబంధిత సమస్యలు, కడుపు ఉబ్బరం తగ్గుతాయి. రాత్రిపూట బార్లీ గింజలను నీళ్లలో నానబెట్టి మరుసటి రోజు పొద్దున్నే ఆ నీళ్లు తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిది. మొలకలు వచ్చిన బార్లీగింజల పొడిని కొద్దిగా చపాతీ పిండిలో కలిపి చపాతీలు చేసుకోవచ్చు.

## అధిక కవలల జనాభా నగరం

**(15 పేజీ తరువాయి)**

తద్వారా ట్విన్స్ (ఇద్దరి కన్నా ఎక్కువ ఉన్నా సరే)కు సంబంధించిన వ్యాపారంలో ఏక ఛత్రాధిపత్యం సాధించారు. అయితే డెబీ, సారా పంపిన కవలలంతా చాలావరకూ సినిమాల్లో ట్విన్స్ రోల్స్ చేయరు. ఒకే పాత్రను చేసేందుకు ట్విన్స్ ఇద్దరిని ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకుంటున్నారు మేకర్స్. వేగంగా షూటింగ్ పూర్తి చేసేయొచ్చన్న భావనతో ఇద్దరికీ ఒకే పాత్ర ఇస్తున్నారు. చైల్డ్ యాక్టర్ల విషయంలోనూ కవలలు ప్రొడ్యూసర్లకు వరంగా మారుతున్నారు. చిన్న పిల్లలను షూటింగ్‌కు అనుమతించే సమయంపై అమెరికాలో పరిమితులు ఉన్నాయి. అదే కవలలను తీసుకుంటే ఒకరి పరిమితి పూర్తవగానే మరొకరితో షూటింగ్ చేసుకోవచ్చు.



అలాగే నాసా స్లీప్ స్టడీ కోసం కవలలను వెతికి పెట్టడంలో డెబీ, లీసానే సాయం చేశారు. ఔషధ పరిశోధనలు చేసే డ్రగ్ సంస్థలు సైతం వీరి సాయం తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఒకే రకమైన కేన్సర్ ఉన్న కవలలు, ఒకే ప్లాసిబో గ్రూప్‌నకు చెందిన కవలలను వీరే వెతికిపెట్టారు.

ఒకే చోట పుట్టి వేర్వేరు ప్రాంతాల్లో పెరిగిన కవలలపై అధ్యయనం చేసేందుకూ పరిశోధకులు లీసా, డెబీనే ఆశ్రయిస్తున్నారు. ఫింగర్ ప్రింట్స్, ఫేషియల్ రికగ్నిషన్, టచ్ ఐడీ వంటి సాంకేతికతలను అభివృద్ధి చేసే కంపెనీలు సైతం డెబీ, లీసా వద్ద ఉన్న కవలలను ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం డెబీ ట్విన్స్ టాలెంట్ మేనేజ్‌మెంట్ బాధ్యతలను చూసుకుంటున్నారు. రియాలిటీ షోలు, ఇతర కంటెంట్‌లను రూపొందించే ట్విన్స్ ట్యాలెంట్ ప్రొడక్షన్స్, లూసిడ్ మీడియా బాధ్యతలు లీసా చేపట్టారు. ప్రస్తుతం ఇలాంటి వ్యాపారం చేస్తున్నది తామేనని డెబీ, లీసా చెబుతున్నారు. తమకు పోటీయే లేదని ధీమాతో ఉన్నారు. ఈ కవలల ప్రపంచాన్ని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, కొత్త కొత్త ప్రాజెక్టులతో ముందుకు వస్తుంటామని అంటున్నారు. ట్విన్స్ రెస్టారెంట్ వల్ల లభించిన ఈ అవకాశాలకు తాము ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటామని చెబుతున్నారు. ఇప్పుడు వీరంతా కోట్లకు పడగలెత్తిన జాబితాలో చేరిపోయారు. ❑

సింగిల్ పేజీ కథ

# బతుకు విలువ

నరెద్దుల రాజారెడ్డి

వెళ్తున్నాను.. చేతిలో తాడు పట్టుకుని పొద్దుకు ఎదురేగుతున్నాను. నా గమ్యం ఎటువైపో తేల్చుకోకముందే పొద్దు వాలిపోతుందని తెలుసు.
అందుకే అడుగుల్ని జోరుగా కదుపుతూ ఊరికి దూరంగా.. జనావాసం లేని చోటుకు వేగంగా వెళ్తున్నాను. బంధాలు అనుబంధాల్ని ఏమార్చిన పాపానికి వాటి రుణం తీర్చుకోవడానికి శ్రద్ధగా కదులుతున్నాను. అది నిర్మానుష్య ప్రదేశం. చుట్టూ బీడు నేల.. అక్కడ ఒకే ఒక చింతచెట్టు వుంది. పైకి చూసాను విశాలంగా కొమ్మల్ని చాపి నేను అనుకున్న పనికి అనువుగా వుంది. ఈమాత్రం ప్రశాంతతగల ప్రదేశంలో శాశ్వత విశ్రాంతి తీసుకుంటే చాలని భావించాను.
మనసులో ఏవో అలనాటి తరంగాలు గతంవైపు లాక్కెళ్లుతున్నాయి.
నాన్న శివయ్య చిన్నకారు రైతు, అమ్మ భాగ్యలక్ష్మి. ఇంటిపని, వంటపని ముగిసాక చేనుకాడ పనికి అలుపు లేకుండా వెళ్తుంటుంది.
నేను ఇంటర్ రెండవ సంవత్సరంలో ఎంజాయ్‌గా కాలాన్ని గడుపుతున్నాను. అమ్మ, నాన్న ఎప్పుడూ వారు పడుతున్న కష్టాలను నాకు తెలిపేవాళ్లు కాదు. ఒక్కగానొక్క కొడుకుననే ప్రేమతో బాగా చదివించి గొప్పవాణ్ణి చేయాలనుకున్నారు. కొంతవరకు బాగానే సాగిన చదువు.. కొన్ని అవలక్షణాలు వచ్చి చుట్టిముట్టినాక చదువు ధ్యాస సంతకెళ్లింది. హాజరుపట్టీ చిన్నబోయింది. అటు వ్యవసాయానికీ ఇటు ఉద్యోగానికీ పనికిరాని జీవితం ఊరు మీద పడి తిరగసాగింది. నాన్న జీర్ణించుకోలేకపోయాడు, అమ్మ భరించలేకపోయింది. పనికిరాని వ్యసనాలన్నీ నాలో తిష్ఠ వేసాక బంధాలు అనుబంధాల్ని మర్చిపోయి నాకు నేనే హీరోలా భ్రమపడ్డాను.
"బాగా చదివించాలని ఉన్న డబ్బు మొత్తం పోగొట్టాను. చదువు రాకపాయే. పోనీ పొలంపనికైనా ఉపయోగపడతావనుకుంటే అదీ చేతకాకపాయే. ఎట్లా బతుకుతావురా?" అంటూ నాన్న అంగలారుస్తుంటే తింటున్న కంచాన్ని కూడా విసిరేసి బయటికి వెళ్లిపోయేవాణ్ణి. పగలంతా చెడు స్నేహితులతో తిరిగి అక్కడే ఆనందాన్ని వదిలేసి ఇంటికి ఆవేశాన్ని మోసుకెళ్లేవాణ్ణి.
"ఈ పూట అన్నం చేయలేదు, ఇంట్లో సరుకులు బొత్తిగా లేవు. ఒరేయ్ నాయనా! ఏదైనా పని చేసి నాలుగు కాసులు సంపాదించరా! కాస్త ఊపిరి తిరుగుతాది. ఇలా ఎన్నాళ్లని వుంటాం" అని అమ్మ మాట పూర్తి కాకముందే నాలో కోపం తన్నుకొచ్చేది. నోటికొచ్చిన బూతులు తిట్టి బలంగా చెంపకేసి కొట్టేవాణ్ణి. వాళ్లు ఏడుస్తుంటే ఇసుమంతైనా బాధ లేకుండా బయటికి వెళ్లేవాణ్ణి.
కొన్నాళ్లు గడిచాక అప్పు చేసి మరీ నాన్న నాకు పెళ్లి చేసాడు. పెళ్లయితే కొన్ని బాధ్యతలు తెలిసొస్తాయని అనుకున్నాడు. అయినా నాలో మార్పు రాకపోయేసరికి వారికి దిగులు పుట్టింది. బయట అందరితోనూ ఆనందంగా గడిపి తీరా ఇంట్లోకి వచ్చేపాటికి ఆవేశం ఆకాశమంత ఎత్తుకు వెళ్లేది. కని పెంచిన తల్లిదండ్రులని కూడా చూడకుండా కొట్టేవాణ్ణి. నమ్మి వచ్చిన పెళ్లాన్ని కూడా జుట్టు పట్టుకుని ఈడ్చేవాణ్ణి. ఊరిలో నన్ను ఎవరూ మనిషిలా భావించేవారు కాదు, మాట్లాడ్డమే మానేసారు.
"అమ్మ, నాన్నను కొట్టడానికి చేతులు ఎలా వస్తాయి? ఆ పాపం ఊరికే పోదు" నేను అలా వెళుతుంటే సూటిపోటిగా కొందరనేవాళ్లు" "పెళ్లి చేసుకుంటే ఏం లాభం? పెళ్లాన్ని పోషించడం రానప్పుడు పెళ్లి చేసుకుని ఆమె గొంతు ఎందుకు కోయాలి?" అంటూ నన్ను చూసి కొందరు దెప్పిపొడిచేవారు. అమ్మ నాన్నకు అన్నం సరిగా పెట్టేవాణ్ణి కాను, ఆకలితో అలమటించి బాధతో కుంగిపోయి మరణించారు.

...

ఇప్పుడు ఇద్దరు కొడుకులు నాకు. నా భార్య కూలిపనులు చేసి ఇద్దర్నీ బాగా చదివించింది. వాళ్లు పెరిగి పెద్దవాళ్లయ్యారు. వారికి అమ్మంటేనే ఎంతో ప్రేమ. నాపై పెద్దగా కనికరం చూపించేవాళ్లు కాదు. "ఒక్కసారైనా మాకు కాలేజీ ఫీజు కట్టావా? ఇష్టమైన తిండి పెట్టావా? పేరుకు మాత్రమే నాన్నగానీ ఏనాడైనా మా బాగోగులు గురించి ఆలోచించావా?" అంటూ పెద్దవాడు అంటుంటే నోరు పెగల్లేదు నాకు. అవ్వ, తాతను చిత్రహింసలు పెట్టావట. కనీసం వాళ్లకు ఒక్కపూట అన్నం కూడా పెట్టలేదట. చెట్టంత కొడుకు వుండీ అనాథలుగా చనిపోయారని ఊరంతా చెప్తున్నారు, కొంచెమైనా సిగ్గుండాలి" అంటూ చిన్నకొడుకు దెప్పుతుంటే నా తల తిరిగిపోయింది.
ఆరోజు నుండి ఇంట్లో పరిస్థితులు తారుమారైపోయాయి. కొన్నాళ్లకు అనారోగ్యంతో భార్య స్వర్గస్తురాలైంది. కొడుకులు నన్ను పట్టించుకోవడం మానేసారు. కనీసం తిన్నావా? అని కూడా అడిగేవాళ్లు కాదు. నా ప్రమేయం లేకుండానే వారికి వారు పెళ్లిళ్లు చేసుకుని నన్ను ఇక్కడే వదిలేసి పట్నం వెళ్లిపోయారు. వేళకు తిండి లేదు, కట్టే బట్ట లేదు. కష్టపడే శక్తి లేదు. బతుకు నరకమైంది. ఆఖరికి నా కన్నీళ్లకు నేనే లోకువైనాను. ఇప్పుడు ఏడ్చినా కన్నీళ్లు కూడా రావు. ఇరుగు పొరుగువారు పట్టించుకోక పోగా "చేసిన పాపం ఊరకే పోతుందా? ఈ జన్మలో చేసిన పాపం ఇక్కడే అనుభవించాలి" అంటూ కొంతమంది అవహేళన చేయడం మొదలుపెట్టారు. ఒక గట్టి నిర్ణయం తీసుకుని ఇలా ఒంటరిగా ఎవరూ లేని చోటుకు వచ్చాను.

...

ఒంట్లోనే కాదు, మనసులోనూ ఏదో నలతగా వుంది. చేతిలో ఉన్న తాడును చెట్టుకొమ్మపైకి విసిరి మెడకు సరిపడా జారుడు గంటు ముడి వేసి, కష్టపడి చెట్టు కొమ్మ దగ్గరకు చేరుకుని కిందికి చూసాను. ఆశ్చర్యం వేసింది. నేను ముడి వేసిన తాడు తెగిపోయి కనిపించింది. చుట్టూ చూసాను, ఎవరూ కనిపించలేదు. ఆత్రంగా చెట్టు దిగి చూస్తే నా ఇద్దరు కొడుకులు నిలుచుని వున్నారు.
"మాకు తెలుసు. ఏదో ఒకరోజు ఈ పని చేసుకుంటావని. అందుకే ఒక మనిషిని నీకు కావలి పెట్టాలి" అన్నాడు పెద్ద కొడుకు.
"నీకు ఈ బాధ తెలియాలనే నిన్ను వదిలేసి వెళ్లిపోయాం. ఇప్పటికైనా తెలిసిందా బతుకు విలువ. కొద్ది రోజులకే లోలోపలి బాధను భరించలేక నీకు చావాలనిపించిందే.
అన్నం, నీళ్లు లేక అల్లాడిపోతూ నీతో దెబ్బలు తింటూ బతుకీడ్చిన నీ తల్లిదండ్రులకు ఎన్నిసార్లు చావాలనిపించి ఉంటుందో తెలుసా? ఇప్పటికైనా అమ్మా నాన్న విలువ తెలిసొచ్చిందా? బంధాలు అనుబంధాలు లేకుంటే ఎంత నరకమో గుర్తొచ్చిందా? ఇకనైనా బాగుండు" అని అంటున్న పెద్దకొడుకుని ఆలింగనం చేసుకుని గట్టిగా ఏడ్చేసాను.

❑

# ఈ వారం కా'ర్ట్యూన్స్'


మార్కెట్లో దొరికేవన్నీ కల్తీ పాలే కద్సార్... ఆ మాత్రం దానికి కొని తెచ్చుకోడం దేనికని నేనే తయారు చేసుకుంటున్నా...!!
Zakir...


ఎవరో జుకర్ బర్గ్ అట.. లక్షల మంది పుట్టినరోజులు గుర్తెట్టుకుని విష్ చేస్తాట్ట.. మీరూ ఉన్నారు.. మీకు నాదే గుర్తుండి చావదు..!!
Zakir...


.. అక్కడికీ.. జిమ్ వాడికి చెప్పాను... ముందు పొట్ట తగ్గాలి.. తర్వాత సిక్స్ ప్యాక్ అని...!!
Zakir...

# ఫోటో ఫీచర్









దక్షిణ కొరియాలోని సియోల్‌లో ఉన్న 'కార్టూన్ కెఫే'కు సంబంధించిన చిత్రాలివి. ఈ కెఫేలోని ద్వారాలు, ఫర్నిచర్‌తో సహా ప్రతి ఒక్కటీ బ్లాక్ అండ్ వైట్ కలర్‌లో వుండటం చెప్పుకోదగ్గ విషయం. కస్టమర్లను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఇలా వైవిధ్యంగా తీర్చిదిద్దారట. ఇక సందేహమెందుకు? వాళ్ల ఆలోచన అక్షరాలా నిజమైంది.



